JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి I గురువారం 12-03-2026
Medchal - Malkajgiri I Thursday 12-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 I సంచిక : 285
పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 285 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me
jayabheripaper@gmail.com





## రాహుల్ గాంధీకి సిగ్గు.. లజ్జ ఉంటే..
# సమాధానం చెప్పాలి

- ఇండ్లు కోల్పోయిన పేదలను పెయిడ్ ఆర్టిస్టులు అంటారా?
- ఇండ్లు కోల్పోయిన బాధితులపై కేసులు ఎలా పెడుతారు?
- ప్రభుత్వ సొమ్మును పందికొక్కుల్లా తింటున్న నువ్వు పెయిడ్ ఆర్టిస్టువి పొంగులేటీ
- రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇల్లు పట్టాలు ఇచ్చి ఇల్లు కట్టేవరకు మిమ్మల్ని వదిలిపెట్టం.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇండ్లు కోల్పోయిన పేదలను పెయిడ్ ఆర్టిస్టులు అంటారా? రియల్ ఎస్టేట్ మాఫియాలా పేదల భూములను దోచుకుంటూ, వేలకోట్ల కాంట్రాక్టులను నీ కొడుకుకు కట్టబెడుతూ.. ప్రభుత్వ సొమ్మును పందికొక్కుల్లా తింటున్న నువ్వు పెయిడ్ ఆర్టిస్టువి పొంగులేటీ అని మండిపడ్డారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిమీద సమగ్ర విచారణ జరిపిస్తాం. న్యాయం జరిగే వరకు ఎవరినీ వదిలిపెట్టమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు, వాళ్లకి పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టేవరకు మిమ్మల్ని వదిలిపెట్టమని అన్నారు.

ఖమ్మంలో ఉన్న ముగ్గురు కాంగ్రెస్ మంత్రుల బినామీలు సురేష్, దామోదర్ రావు, కిషోర్. వెలుగుమట్లలో ఉన్న భూదాన్ భూములను దోచుకోవడానికే పేదల ఇండ్లను కూల్చివేశారు. ఒక శత్రుదేశం మీదకి పోయినట్లు అర్ధరాత్రి 3 గంటలకు 3000 మంది పోలీసులు పోయి, పేదలను మెడలు పట్టుకొని బయటకు తోసి ఇండ్లను కూల్చేశారు. పనికిమాలిన కాంగ్రెస్ మంత్రులు చెప్తే ఇండ్లు కోల్పోయిన వెలుగుమట్ల బాధితులపై ఏసీపీ కేసులు పెట్టాడు. ఆయన అన్నం తింటున్నాడా? గడ్డి తింటున్నాడా అని ప్రశ్నించారు. ఇండ్లు కోల్పోయిన బాధితులపై కేసులు ఎలా పెడుతారు? వాళ్లకి భోజనం పెడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కూడా అక్రమ కేసులు పెడుతున్నారు. ఇండ్లు కోల్పోయిన కొందరు బాధితులకు పట్టాలు ఇచ్చారంటే.. ఇండ్లు కూల్చి తప్పు చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకున్నట్లే. కాబట్టి వెంటనే తప్పుడు కేసులు బనాయించామని ఒప్పుకొని, క్షమాపణలు చెప్పి, కేసులు విత్ డ్రా చేసుకోవాలి. రాహుల్ గాంధీకి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్కు సన్మానం చేద్దాం అనుకుంటున్నాం. భారతదేశ చరిత్రలో ఇంత అద్భుతమైన నిర్ణయం ఇప్పటివరకు ఏ స్పీకర్ తీసుకోలేదు. ప్రజాస్వామ్యం మీద, రాజ్యాంగం మీద రాహుల్ గాంధీ చేస్తున్న బహిరంగ దాడి ఇది. రాహుల్ గాంధీకి సిగ్గు, లజ్జ ఉంటే పార్టీ ఫిరాయింపులపై సమాధానం చెప్పాలని అన్నారు.

## కొత్త గవర్నర్ తెలుగులో
# స్వీకార ప్రమాణం





- తెలంగాణ కొత్త గవర్నర్ ప్రతాప్ శుక్లా.. తన ప్రమాణ పత్రాన్ని పూర్తిగా తెలుగులోనే
- ఇటీవల గవర్నర్ల బదిలీ ప్రక్రియలో భాగంగా హిమాచల్ ప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్గా శివ ప్రతాప్ శుక్లా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, శివ ప్రతాప్ శుక్లాతో ప్రమాణం చేయించారు. లోక్భవన్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. అయితే..ఇతర గవర్నర్ల మాదిరిగా కాకుండా, ప్రతాప్ శుక్లా.. తన ప్రమాణ పత్రాన్ని పూర్తిగా తెలుగులోనే చదవడం విశేషం. ఉత్తరప్రదేశ్లోని గోరఖ్పూర్కు చెందిన శివప్రతాప్ శుక్లా వృత్తి రీత్యా న్యాయవాది. అయితే, ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత..ఈ వృత్తిని వదులుకున్నారు. బీజేపీ వ్యవస్థాపన నుంచి ఆయన ఆ పార్టీలోనే ఉన్నారు.1989 నుంచి ప్రజాప్రతినిధిగా కూడా పనిచేశారు.1989 నుంచి 2012 వరకు ఆయన గోరఖ్ పూర్ రూరల్ ఎమ్మెల్యేగా వరుస విజయాలు దక్కించుకున్నారు. రాష్ట్రంలో ఏర్పడిన తొలి బీజేపీ ప్రభుత్వంలో ఆయన మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత..రాష్ట్ర బీజేపీ సారథ్య బాధ్యతలు కూడా నిర్వహించారు. ఇక, 2016లో రాజ్యసభకు ఎంపీగా ఎన్నికయ్యారు. 2017 సెప్టెంబరు 3 నుండి 2019 మే 30 వరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా శుక్లా పనిచేశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినప్పటికీ..ఆయన నిమ్న వర్గాల అభ్యున్నతి, వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేశారన్న పేరుంది. 2023 ఫిబ్రవరి 13 నుండి హిమాచల్ప్రదేశ్ గవర్నర్గా పనిచేస్తున్నారు. ఇటీవల గవర్నర్ల బదిలీ ప్రక్రియలో భాగంగా హిమాచల్ ప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీపై వచ్చారు. మంచివిద్యావేత్తగా, ఆలోచనా పరుడిగా ఆయనకు పేరుండడం గమనార్హం.

# వెలుగమట్ల బాధితులకు అక్కడే ఇళ్లు




- భూదాన్ బాధితులకు రేవంత్ సర్కార్ తీపి కబురు
- అర్హులైన కుటుంబాలకు అందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం హామీ
- భూదాన్ భూమిలో మొత్తం 742 కుటుంబాలకు చెందిన ఇళ్ల ను ఫిబ్రవరి 24న అధికారులు జేసీబీలతో నేలమట్టం

**జయభేరి, ఖమ్మం, మార్చి 11 :**

ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ బాధితులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. కూల్చిన చోటే బాధితులకు స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికే అర్హులైన బాధితులను గుర్తించిన అధికారులు నేడు పట్టాలు పంపిణీ చేయనున్నారు. మొత్తం 412 మంది బాధితులకు పట్టాలు ఇవ్వనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం శివారు వెలుగుమట్ల భూదాన్ భూముల వ్యవహారం హాట్ టాఫిక్గా మారిన సంగతి తెలిసిందే. అక్కడ కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. అవి ప్రభుత్వ భూములని పేర్కొంటూ పది రోజుల క్రితం రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. దీంతో వందల కుటుంబాలు నిరాశ్రయులుగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో అర్హులైన

...మిగతాది 2 లో




# 400 కోట్లతో 'గాంధీ సరోవర్'

- 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం, మ్యూజియం, 'లండన్ ఐ' తరహాలో చరఖా రంగుల రాట్నం
- మూసీ నదిపై 15 వంతెనలు, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్, పర్యాటక హంగులను ఏర్పాటు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 11, :**

మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం బాపూఘాట్ వద్ద రూ. 400 కోట్లతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే.

## రాష్ట్ర అభివృద్ధి..
# పాలనపై కీలక దిశానిర్దేశం



- మార్చి 23వ తేదీన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్కు శంకుస్థాపన
- ఇరాన్ యుద్ధ ప్రభావం వల్ల రాష్ట్రంలోని అరటి, గుడ్ల వంటి ఉత్పత్తుల ధరలు పడిపోతున్నాయని ఆందోళన
- గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్కు తరలించే వారిపై కఠిన చర్యలు

**జయభేరి, విజయవాడ, మార్చి 11 :**

అమరావతిలో జరిగిన 6వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి, పాలనపై కీలక దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం కేవలం బిలియనీర్లు, ట్రిలియనీర్ల కోసం మాత్రమే కాదని, సామాన్య పేదల సంక్షేమం కోసమే పనిచేస్తోందనే విషయాన్ని అధికారులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. మార్చి 23వ తేదీన రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్కు శంకుస్థాపన చేయబోతున్నట్లు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వెల్లడించారు. పాలనలో ఆధునిక సాంకేతికతను జోడించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, డేటా డ్రివెన్ గవర్నెన్స్ మరియు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగాన్ని పెంచాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం, 'మనమిత్ర' వాట్సప్

...మిగతాది 2 లో




## లోక్సభలో తెలంగాణకు
# అవమానం

- టీడీపీ ఎంపీ కించపరచలేదని క్లారిటీ
- తెలంగాణపై పడి ఏడవడం వారికి అలవాటుగా మారిపోయిందని దాసోజు శ్రవణ్ తీవ్ర వ్యాఖ్యలు

**జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 11 :**

ఇటీవల పార్లమెంటులో ఏపీ టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన వ్యాఖ్యలు తెలంగాణను అవమానించేలా ఉన్నాయంటూ..

▶▶ మొదటిపేజీ తరువాయి

## వెలుగమట్ల బాధితులకు అక్కడే ఇళ్లు

కుటుంబాలకు అందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు కూల్చిన చోటే బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని తాజాగా నిర్ణయం తీసుకుంది.ఇళ్లు నేలమట్టం చేసిన ప్రాంతాన్ని చదును చేసే పనులను మంగళవారం ప్రారంభించింది. కొద్దిరోజులుగా రెవెన్యూ అధికారులు జరిపిన సామాజిక, ఆర్థిక సర్వే ఆధారంగా అర్హులైన బాధితులను గుర్తించింది. వారికి ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్లను బుధవారం మంజూరు చేయనుంది. ఈ మేరకు నేడు ఖమ్మం కలెక్టరేట్లో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఈ పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధి వినోబాభావే నగర్లోని భూదాన్ భూమిలో మొత్తం 742 కుటుంబాలకు చెందిన ఇళ్లను ఫిబ్రవరి 24న అధికారులు జేసీబీలతో నేలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా భూదాన్ భూమిని ఆక్రమించారని.. హైకోర్టు, సీసీఎల్ఏ ఆదేశాల మేరకు వాటిని తొలగించినట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. దీంతో ఇళ్లు కోల్పోయిన బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. 134కు పైగా కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారు అంబేద్కర్, టీటీడీసీ భవనాల్లోనే తాత్కాలికంగా తలదాచుకుంటున్నాయి. బాధితులకు న్యాయం చేయాలంటూ ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రజాసంఘాలు ఆందోళనకు దిగాయి. దీంతో ఈ ఇష్యూ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఇళ్లు కోల్పోయిన బాధితుల్లో అర్హులను గుర్తించటానికి రెవెన్యూ అధికారులు కూల్చివేత చిత్రాలు, ఆధార్, రేషన్కార్డుల ఆధారంగా వారి అడ్రస్లు సేకరించారు. ఫీల్డ్ సర్వేలో మొత్తం 412 కుటుంబాలు అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు వారికి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనుండగా.. ఇప్పటికే టోకెన్లు పంపిణీ చేశారు. నేడు బాధితులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు.

## లోక్సభలో తెలంగాణకు అవమానం

తెలంగాణ రాజకీయ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంపై మాట్లాడుతూ.. బ్లాక్ డే అంటూ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ వ్యవహారం కాస్తా తీవ్ర దుమారానికి కారణం కావడంతో.. ఆయన స్పందించారు. తాను తెలంగాణను అవమానించలేదని క్లారిటీ ఇచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి ఆంధ్రప్రదేశ్, తెలంగాణగా ఏర్పడి 12 ఏళ్లు పూర్తి అయింది. ఈ సందర్భంగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా మాట్లాడిన టీడీపీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య తీవ్ర వివాదానికి కారణం అయ్యాయి. లోక్సభలో జరిగిన చర్చలో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు.. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంపై మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఈ క్రమంలోనే 2014 ఫిబ్రవరి 14వ తేదీని బ్లాక్ డేగా ఎంపీ లావు అభివర్ణించడంపై.. బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. అయితే తన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో ఎట్టకేలకు ఆయన స్పందించారు. పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్.. ఏపీ ఎంపీలు తెలంగాణపై ఏడుపు ఆపాలని హెచ్చరించారు. రాష్ట్రం విడిపోయి 12 ఏళ్లు గడుస్తున్నా తెలంగాణపై ఏపీ నేతలు విషం చిమ్మడం మాత్రం ఆపడం లేదని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వాన్ని లోక్సభ వేదికగా కించపరిచేలా ఎంపీ లావు మాట్లాడారని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ఏం కావాలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని అడిగే తెలివి లేక.. తెలంగాణపై పడి ఏడవడం వారికి అలవాటుగా మారిపోయిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అనవసరంగా తెలంగాణ జోలికి వచ్చి తమ ప్రజలను అవమానించినా.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కించ పరిచే విధంగా మాట్లాడితే మాత్రం తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.ఇక తెలంగాణపై తాను చేసిన వ్యాఖ్యలు ఇంతటి వివాదానికి కారణం కావడంతో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు క్లారిటీ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఎంపీ లావు.. తాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించలేదని తేల్చి చెప్పారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని కించపరిచేలా కూడా ఏం మాటలు మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లు ఆమోదం పొందే సమయంలో అప్పటి లోక్సభ స్పీకర్గా ఉన్న మీరా కుమార్ తీరుపై మాత్రమే తాను మాట్లాడినట్లు చెప్పారు. ఆ సమయంలో లోక్సభ స్పీకర్ మీరా కుమార్ రూల్స్ అతిక్రమించేలా వ్యవహరించారని మాత్రమే తాను పేర్కొన్నట్లు క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి.. మళ్లీ తెలంగాణ, ఏపీ సెంటిమెంట్ను రాజేయవద్దని బీఆర్ఎస్ నేతలకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు.

## రాష్ట్ర అభివృద్ధి.. పాలనపై కీలక దిశానిర్దేశం

గవర్నెన్స్ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. 2028 మార్చి నాటికి రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను పూర్తి చేయడమే లక్ష్యమని, కొప్పర్తి, ఓర్వకల్లు వంటి ప్రాంతాలను పారిశ్రామిక క్లస్టర్లుగా తీర్చిదిద్దాలని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 MSMEలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ఉపాధిని మెరుగుపరుస్తామని తెలిపారు. అంతర్జాతీయ పరిణామాలపైనా సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. ఇరాన్ యుద్ధ ప్రభావం వల్ల రాష్ట్రంలోని అరటి, గుడ్ల వంటి ఉత్పత్తుల ధరలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతకాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు సొంత బ్రాండింగ్ కల్పించి మార్కెటింగ్ చేయాలని సూచించారు. 2047 నాటికి ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం రూ. 55 లక్షలకు చేరుకోవాలనే విజన్తో పనిచేయాలని, ముఖ్యంగా P4 విధానాన్ని గేమ్ ఛేంజర్గా మలిచే బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

**గ్యాస్ కష్టాలు లేవన్న నాదెండ్ల**

ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు పలు దేశాల్లో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడుతోంది. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అక్కర్లేదని, ఏపీలో గ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గుడ్ న్యూస్ చెప్పారు. అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఏపీలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడుతుందనే ప్రచారానికి ఆయన చెక్ పెట్టారు. ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్లో మంత్రి నాదెండ్ల మనోహర్ రాష్ట్రంలోని గ్యాస్ నిల్వలపై సమీక్ష జరిపారు. ఆంధ్రప్రదేశ్లో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, గృహ అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి అనవసరంగా ఆందోళన చెందవద్దని, కేవలం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు, అధికారుల ప్రకటనలు మాత్రమే నమ్మాలని ఆయన విజ్ఞప్తి చేశారు.గ్యాస్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, విశాఖపట్నం రిఫైనరీ, మంగళూరు హస్సన్ చర్లపల్లి పైప్లైన్ ద్వారా సరఫరా సజావుగానే సాగుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఒకవేళ నిల్వలలో ఏదైనా తేడా వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఎల్పీజీ గ్యాస్ గృహ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ మొదటి ప్రాధాన్యత అని, అవసరమైతే వాణిజ్య అవసరాలకు ఇచ్చే సరఫరాను క్రమబద్ధీకరించి ప్రజలకు అండగా ఉంటామని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ సమయంలో గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్కు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి, కృత్రిమ కొరత సృష్టించే వారిపై నిఘా ఉంచాలని సూచించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ధరలను ఇష్టానుసారంగా పెంచినా లేదా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు.

# జెన్ జీ పైనే ఆశలన్నీ..



సౌత్ ఏషియాలో ఓ శక్తివంతమైన కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావాన్ని చూస్తోం ది. జనరేషన్ జెన్ అనే యువతరంగం. విరామం లేని, డిజిటల్గా మమేకమై, అసహన తరం. స్మార్ట్ ఫోన్లు, సోషల్మీడియా, గ్లోబల్ కనెక్టివిటీ యుగంలో ఆవిర్భవించిన ఈ తరం దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయించిన రాజకీయ స్తబ్దత, అవినీతి, వంశపారంపర్య అధికార వ్యవస్థలను అంగీకరించడానికి సిద్ధంగా లేదు. నేపాల్లో ఈ మధ్య జరిగిన ఎన్నికలు ఈ తరం మార్పునకు ఓ అద్భుతమైన ఉదాహరణ. బాలేంద్ర షా విజయం, యువత నడిపే రాజకీయ ఉద్యమం విస్తరణ నేపాల్ సాంప్రదాయ రాజకీయ వ్యవస్థను కూల్చివేసింది. అదే సమయంలో, బంగ్లాదేశ్లో జరిగిన పరిణామాలు విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ప్రయోగం నిరసనలను రాజకీయ శక్తిగా మరల్చడంలో విఫలమైంది. నేపాల్కు విరుద్ధమైన కథ ఇది. ఈ కథనాలు పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. జనరేషన్ జెన్ భారతదేశంతో సహా దక్షిణాసియా అంతటా రాజకీయాలను పునర్నిర్మించగలదా. నేపాల్లో ఈ మధ్య జరిగిన ఎన్నికలు ఓ రాజకీయ భూకంపం వంటివే.

దశాబ్దాలుగా నేపాల్ రాజకీయం సాంప్రదాయ పార్టీలు, అనుభవజ్ఞులైన నాయకుల ఆధిపత్యంలో సాగేవి. నేపాలీ కాంగ్రెస్ వర్గాలు, కె.పి.శర్మ ఓలి వంటి ప్రముఖుల నేతృత్వంలో కమ్యూనిస్ట్ గ్రూప్ల మధ్య రాజకీయ అధికారం ఊగిసలాడింది. 2008లో రాచరిక వ్యవస్థ రద్దయి గణతంత్ర రాజ్యాంగం ఆమోదం పొందినా, వ్యవస్థ మారలేదు నేపాల్ లో రాజకీయ వ్యవస్థ ఒక ఉన్నత వర్గం నుంచి మరో ఉన్నత వర్గానికి బదిలీ అయిందని చాలామంది నేపాలీ పౌరులు భావించారు. అవినీతి, కుంభకోణాలు, వర్గపోరు, దీర్ఘకాలిక అస్థిరత ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఫలితంగా జనాభాలో పెద్ద సంఖ్యలో ఉన్న యువ నేపాలీల నిరాశ నిస్పృహలు తారస్థాయికి చేరాయి. నేపాల్లో జనరేషన్ జెన్ కొత్త తరహా రాజకీయాలను కోరింది పారదర్శకంగా, జవాబుదారీగా, దేశపాలనను నియంత్రించిన పాలకులనుంచి విముక్తి పొందింది. ఇందుకు సోషల్ మీడియా ప్రధాన సాధనంగా మారింది. కార్యకర్తలు నిరసనలు నిర్వహణకు, సమాచారాన్ని పరస్పరం పంచుకోవడానికి, రాజకీయ సంకేతాలను అనూహ్యమైన వేగంతో సమన్వయం చేయడంలో వీలు కల్పించింది. డిజిటల్ లాండ్స్కేప్ నేపాలి యువతలో కొత్తరాజకీయ చైతన్యాన్ని సృష్టించడంలో కీలకం అయింది. పట్టణాలలోని కార్యకర్తలు, విద్యార్థులు, యువ నిపుణులను శక్తివంతమైన సమష్టి శక్తిగా ఏకంచేసింది. ఈ పరిణామాలనుంచి బాలేంద్ర షా అనే యువ తరంగం ఉద్భవించాడు. అందరూ బాలెన్ అని పిలిచే, రాపర్, ఇంజనీర్, ఆతర్వాత కాలంలో ఖాట్మండు మేయర్ అయిన బాలేంద్ర షా, సాంప్రదాయ రాజకీయ తరగతికి పూర్తి భిన్నంగా ప్రాతినిధ్యం వ్యవహరించాడు. యువకుడు, నిష్కపటంగా మాట్లాడేవాడు కావడం సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అతడు నేపాల్ పట్టణ యువత ఆకాంక్షలను నేరుగా తీర్చాడు. అతడి ఆవిర్భావం దశాబ్దాలుగా నేపాల్పై ఆధిపత్యం సాగించిన పాత రాజకీయ సంస్కృతి నీరుగారిపోయింది. బాలెన్ షా రాజకీయ విజయం యాదృచ్ఛికం కాదు.

అతడి ప్రచారం యువత నిరసన శక్తిని సమర్థంగా ఉపయోగించుకుంది. దానిని ఒక వ్యవస్థీకృత ఎన్నికల ఉద్యమంగా మార్చింది. సోషల్ మీడియా కీలక పాత్ర, అట్టడుగు వర్గాల సమీకరణ, సుపరిపాలన, అవినీతి నిరోధక సంస్కరణలతో కేంద్రీకృతమైన సందేశంతో బాలేంద్ర షా, అతని మిత్రులు నేపాల్లో రాజకీయ పార్టీలకు దీటైన ప్రత్యామ్నాయాన్ని నిర్మించడంలో విజయం సాధించారు. నేపాల్ ఎన్నికల ఫలితాలు సాంప్రదాయ రాజకీయ ఉన్నత వర్గాలపట్ల ప్రజల సంతృప్తిని ఎత్తిచూపాయి. దశాబ్దాలలో మొదటిసారిగా, నేపాల్ ప్రధాన పార్టీల దీర్ఘకాలిక ఆధిపత్యం, యువత క్రియాశీలతతో తలెత్తిన కొత్త రాజకీయశక్తినుంచి తీవ్రమైన సవాలు ఎదుర్కొంది. షా విజయం ఒకప్పుడు నిరసనల ద్వారా తమ కోపాన్ని వ్యక్తం చేసిన తరం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. బిఎన్పి పునరాగమనం, ప్రభుత్వ మార్పును సూచిస్తున్నా, యువత ఆశించిన పరివర్తనను అది పాదుకొల్పలేదు. బంగ్లాదేశ్ అనుభవం నిరసన ఉద్యమాలను స్థిరమైన రాజకీయ సంస్థలను మార్చడంలో ఎదురయ్యే ఇబ్బందులను చెప్పక చెబుతోంది. నేపాల్, బంగ్లాదేశ్లలో ఎదురైన విభిన్నమైన ఫలితాలు, యువత రాజకీయాల గురించి ఓ ప్రాథమిక సత్యాన్ని వివరిస్తాయి. సామూహిక నిరసనలు, రాజకీయ వ్యవస్థలను సవాల్ చేయగలవు కానీ, మార్చలేవు. విశ్వసనీయమైన నాయకత్వం, స్పష్టమైన దృక్పథం, ఎజెండాతో నిసనలు రాజకీయ ఉద్యమాలుగా పరిణామం చెందకపోతే, ఉన్న వ్యవస్థ స్థానే కొత్త వ్యవస్థను నిర్మించలేవు.

నేపాల్లోని జనరేషన్ జెడ్ తిరుగుబాటు యువతశక్తిని ఎన్నికల రాజకీయాల్లో ప్రవేశపెట్టగల నాయకుడిని తయారు చేయడం వల్లే విజయవంతం అయ్యాయి. అతి పెద్ద దేశం, ఎన్నో రాజకీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు లోతైన సంస్థాగత నెట్వర్క్, ఆర్థిక వనరులు కలిగి ఉంటాయి. అవి కొత్త ఉద్యమాలను కష్టతరం చేస్తాయి. భారతదేశంలో ఎన్నికల రాజకీయాలకు విస్తృత స్థాయిలో అట్టడుగు స్థాయినుంచి సమీకరణ, సంస్థాగతంగా సంకీర్ణపరమైన నిర్మాణం అవసరం. ఇంకా కులం, మతం, భాష, ప్రాంతీయ గుర్తింపులతో కూడిన విస్తృతమైన సామాజిక వైవిధ్యం, తరచు రాజకీయ సమీకరణలను విచ్ఛిన్నం చేస్తుంది. యువత క్రియాశీలత జాతీయ దృష్టిని ఆకర్షించినా, ఆ శక్తి ఏకీకృత రాజకీయ ఉద్యమంగా మార్చడం సవాల్గా మిగిలిపోతుంది. అయినా, భారతదేశంలో జనరేషన్ జెడ్ రాజకీయ తరంగాన్ని తక్కువగా అంచనా వేయలేం. యువ ఓటర్లు నిర్మాణాత్మక ఎన్నికల కూటమిగా మారుతున్నారు. రాజకీయ పార్టీలు, తమ అజెండాలు, నాయకత్వాలను నిర్మించడంలో యువ ఓటర్ల డిమాండ్లను ప్రతిబింబించేలా మార్చుకోవచ్చు. డిజిటల్ సమీకరణతో అట్టడుకు స్థాయి యువత ఆధారిత ఉద్యమం ఉద్భవిస్తే, భారతదేశ రాజకీయ దృశ్యం సమర్థవంతంగా పునర్మాణం కాదలదు. ఈశాన్య భారతంలో అటువంటి మార్పునకు వీలు కల్పిస్తున్నది. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలు భారతదేశంలోని మిగతా ప్రాంతాలతో సిలిగురి కారిడార్ ద్వారా అనుసంధానమై ఉన్నాయి. ఈ ప్రాంతానికి అటు నేపాల్, ఇటు బంగ్లాదేశ్ ఉన్నాయి. ఈ పొరుగు దేశాలలో రాజకీయ పరిణామాలు భారతదేశానికి వ్యూహాత్మకంగా ముఖ్యమైనవిగా మారాయి. నేపాల్ రాజకీయ కొత్త నాయకత్వంలో మార్పు, సరిహద్దు ఆర్థిక సహకారాన్ని ప్రభావితం చేయవచ్చు. యువ నాయకత్వంలో సంస్కరణలతో కూడిన ప్రభుత్వ మౌలిక సదుపాయాల అభివృద్ధి, వాణిజ్య విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వగలదు. ఈ విధానాలు నేపాల్, బంగ్లాదేశ్, భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయగలవు. బంగ్లాదేశ్ రాజకీయ పథం అంతే కీలకమైనది. భారదేశ ప్రధాన భూ భాగాన్ని ఈశాన్య ప్రాంతాలతో కలిపే కనెక్టివిటీ ప్రాజెక్టులకు ఈ దేశం ప్రధాన రవాణా మార్గంగా పని చేస్తుంది. బంగ్లాదేశ్లో రాజకీయ స్థిరత్వం నెలకొంటే ఈ ప్రాంత ఆర్థిక భవిష్యత్ను రూపొందించడంలో కీలక పాత్ర వహిస్తుంది. నేపాల్లో, దక్షిణాసియాలోని ఇతర ప్రాంతాలలో యువత నేతృత్వంలో రాజకీయ ఉద్యమాలు ఊపందుకుంటే, ఈ ప్రాంతం అంతటా రాజకీయ చర్చను ప్రభావితం చేయవచ్చు. నేపాల్, బంగ్లాదేశ్ నుంచి అందిన పాఠాలు భారతదేశానికి ప్రోత్సాహకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలోని యువజనాభా ప్రజాస్వామ్య రాజకీయ ఉద్యమాలను పునర్నిర్మించే సామర్థ్యం కలిగి ఉంది. ఆ సామర్థ్యాన్ని నిజమైన రాజకీయశక్తిగా మార్చే నాయకత్వం, సంస్థ, సంస్థాగత ఆవిష్కరణలు అవసరం.

## 400 కోట్లతో 'గాంధీ సరోవర్'

తాజాగా ఈ ప్రాజెక్టు సంబంధించిన డీపీఆర్ రెడీ అయింది. 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం, మ్యూజియం, 'లండన్ ఐ' తరహాలో చరఖా రంగుల రాట్నం ఈ ప్రాజెక్టు ప్రధాన ఆకర్షణలు. మూసీ నదిపై 15 వంతెనలు, సైక్లింగ్ ట్రాక్లు, బోటింగ్, పర్యాటక హంగులను ఏర్పాటు చేస్తూ డీపీఆర్ సిద్ధం చేశారు. హైదరాబాద్ నగర నడిబొడ్డున ప్రవహించే మూసీ నదిని అందంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మురుగు, వ్యర్థాలతో ప్రవహిస్తున్న మూసీ నదిని ప్రపంచ స్థాయి పర్యాటక, ఆర్థిక కేంద్రంగా మార్చటమే లక్షంగా సర్కార్ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టింది. ఈ చర్యలో భాగంగా.. బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ను సైతం చేపడుతోంది. ఈ మేరకు తాజాగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డీపీఆర్ను సిద్ధం చేసింది. బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం నిర్మాణం కానుంది. మూసీ నదికి రెండు వైపులా విశాలమైన రోడ్లు, నది పొడవునా ఆకట్టుకునే పార్కులు ఏర్పాటు కానున్నాయి. బాపూఘాట్ వద్ద ప్రభుత్వానికి 60 ఎకరాల భూమి భూమి ఉంది. ఇందులో 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతుంది. 100 మీటర్ల ఎత్తు వరకు పలు అంతస్తుల్లో టవర్ కట్టి అందులో సమావేశ గదులు, మ్యూజియం, గాంధీ చరిత్రపై ప్రదర్శనశాల, కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఈ టవర్పై 3550 మీటర్ల ఎత్తున గాంధీ విగ్రహం కొలువుదీరనుంది. గాంధీ విగ్రహం వెనుక లండన్ థేమ్స్ నది ఒడ్డున కనిపించే 'లండన్ ఐ'ను పోలిన రంగుల రాట్నం ఏర్పాటు చేయనున్నారు. గాంధీ స్మృతుల్లో ఒకటైన చరఖాను తలపించేలా ఈ నిర్మాణం కనిపించనుంది. పక్కనున్న 98 ఎకరాల డిఫెన్స్ భూములను సేకరించే ప్రక్రియ ప్రస్తుతం పురోగతిలో ఉందని అధికారులు చెబుతున్నారు. మూసీలో నిత్యం మంచినీటిని ప్రవహింపజేయడంతోపాటుగా నదికి రెండు వైపులా ఉన్న పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హిమాయత్సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తంగా 15 వంతెనలు నిర్మిస్తారు. ఒకవైపు 100 అడుగుల రోడ్డు, మరోవైపు 80 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. దాంతో పాటుగా కాలిబాట, సైక్లింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తారు. నదిలో పూడికను తొలగించి, అంచులను సరిచేసి కొన్ని ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. పిల్లల పార్కులు, హోటళ్లు, వేడుకలు నిర్వహించుకునేలా యాంఫీ థియేటర్లు ప్రాజెక్టులో భాగం కానున్నాయి. మూడు, నాలుగు చోట్ల చిన్నపాటి ఆనకట్టలనూ కూడా నిర్మిస్తారు. గాంధీ సరోవర్లో బోటింగ్ సదుపాయం కూడా ఉండనుంది.

## కడియం, దానంలకు బిగ్ రిలీఫ్



✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 11

తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు అనర్హత పిటిషన్లు హాట్ టాఫిక్గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వగా.. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ఊరట దక్కింది. పిటిషన్లపై విచారణ జరిపిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వారు పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేవంటూ వాటిని డిస్మిస్ చేశారు. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్ దక్కినట్లయింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు.. మార్చి 12లోగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ చేసి తుది నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, తాజాగా ఇద్దరితో కలిపి మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు ఊరట లభించింది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. వారిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎం. సంజయ్ కుమార్, గూడెం మహిపాల్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, కాలెయాదయ్య, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీ మారినట్లు మీడియాలో కథనాలు రావటంతో వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద మరికొందరు సభ్యులు స్పీకర్కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ సకాలంలో చర్యలు తీసుకోకపోవటంతో తెలంగాణ హైకోర్టు, ఆ తర్వాత సుప్రీం కోర్టులోనూ పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో సుప్రీం కోర్టు స్పీకర్పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మార్చి 12లోగా విచారణ జరిపి నిర్ణయాన్ని వెల్లడించాలని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గతంలోనే 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్ తాజాగా.. దానం, కడియంలపై ఇచ్చిన పిటిషన్లను సైతం కొట్టేశారు.అయితే వీరిలో దానం నాగేందర్ 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయన పార్టీ మారినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని.. చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తూ వచ్చారు. కానీ స్పీకర్ మాత్రం అనుహ్యంగా దానం నాగేందర్కు సైతం క్లీన్ చిట్ ఇచ్చారు. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజని అంటున్నారు. వాళ్లు పార్టీ మారకపోతే బీఆర్ఎస్ భవన్కు రావాలని సవాల్ విసురుతున్నారు. కాగా, స్పీకర్ నిర్ణయంపై దానం హర్షం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా తనను మానసిక క్షోభకు గురిచేశారని అన్నారు. తాను సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేయటం పూర్తిగా తన వ్యక్తిగతమని అన్నారు. ప్రాథమిక హక్కును ఉపయోగించుకోనే పోటీలో నిలిచినట్లు చెప్పుకొచ్చారు.

ఒక రోజు ముందే

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, నిర్ణీత గడువు ముగుస్తుండటంతో స్పీకర్ కార్యాలయం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మొత్తం పదిమంది ఎమ్మెల్యేల్లో ఇప్పటికే ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్చిట్ ఇచ్చారు. దానం, కడియంలపై తాజాగా వాదనలు పూర్తికాగా.. నిర్ణయాన్ని ప్రకటించారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ లభించింది. సుప్రీంకోర్టు సూచనల ప్రకారం మార్చి 12వ తేదీలోపు వీరిద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉండగా.. ఒకరోజు ముందే.. స్పీకర్ కడియం, దానం నాగేందర్పై దాఖలైన రెండు పిటిషన్లను డిస్మిస్ శారు.స్పీకర్ తీర్పు తర్వాత దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని.. వ్యక్తిగత నిర్ణయంతోనే కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశానని దానం నాగేందర్ పేర్కొన్నారు. తన ఫండమెంటల్ రైట్ను కాలరాసే హక్కు ఎవరికీ లేదని.. ఆరు నెలలుగా క్షోభను అనుభవించానన్నారు. స్పీకర్ని కూడా ఆరు నెలలుగా ఇబ్బంది పెడుతూ వచ్చారని.. దానం పేర్కొన్నారు.ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన కాంగ్రెస్లో చేరిన దానం నాగేందర్పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు పిటిషన్ వేశారు. స్టేషన్ ఘన్పూర్ నుంచి కారు గుర్తుతో పోటీచేసిన కడియం శ్రీహరి.. కాంగ్రెస్లో చేరడాన్ని ప్రశ్నిస్తూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అనర్హత పిటిషన్ ఫైల్ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషనపై సుప్రీంకోర్టులో రేపు విచారణ జరుగనుంది. దాంతో.. అంతకంటే ముందే స్పీకర్ తన తీర్పును వెల్లడించారు.

# దేవ దేవుడికి వేదోక్తంగా నిత్య పూజలు





- యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.12.14 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి11:**

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి వేదోక్తంగా నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్య నారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.12,14,835 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,05,700, బ్రేక్ దర్శనం ద్వారా రూ.81,300, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,35,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.1,95,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.39,180, ప్రసాద విక్రయం ద్వారా రూ.4,47,640, కల్యాణ కట్ట ద్వారా రూ.25,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలి

- విద్యుత్ షాక్ గురై మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించిన VHPS జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ

**జయభేరి, చెన్నూరు :**



దండేపల్లి మండలం మేదరి పేట పెట్రోల్ బంకు వద్ద విద్యుత్ షాక్ తో మృతి చెందిన వికలాంగుడు చల్ల లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను ఈరోజు దండేపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో వారి ఇంటి వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా VHPS జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని పూర్తిగా పెట్రోల్ బంకు యజమాన్యం నిర్లక్ష్యం ద్వారానే రెండు నిండు ప్రాణాలు బలి అయ్యాయని తెలిపారు బాధితులకు నష్టపరిహారం తో పాటు వారికి ఉపాధి చూపించాలని ఈ సందర్భంగా కోరారు వికలాంగుల హక్కుల పోరాట సమితి వారి కుటుంబానికి పూర్తిగా అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. పరామర్శించిన వారిలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులతోపాటు గ్రామ పెద్దలు స్థానిక నాయకులు బంధువులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు వీహెచ్పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ జిల్లా కన్వీనర్ బి వి అప్పారావు జిల్లా నాయకులు దేవి ప్రకాష్ మామిడి రాజశేఖర్ చిప్పకుర్తి సురేష్ దండేపల్లి మండల కమిటీ నాయకులు జంబోజు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ కు లడ్డు ప్రసాదం అందజేత

- ఆలేరు అభివృద్ధికి సహకరించాల్సిందిగా రాజ్యసభ ఎంపీ నరేందర్ కు వినతి
- సీఎం రేవంత్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డితో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భేటీ

**జయభేరి, యాదగిరిగుట్ట :**



ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం హైదరాబాదులో బిజీ బిజీగా గడిపారు. మర్యాద పూర్వకంగా ఆయన పలువురు ప్రముఖులను కలిశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు.


**రాజ్యసభ ఎంపి వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు**

రాజ్యసభ ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆలేరు నియోజకవర్గం అభివృద్ధికి తమ వంతు కృషి అవసరమని ఆయనను కోరారు.

# ఓటర్ జాబితా మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**జయభేరి, యాదగిరిగుట్ట :**



ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. బుధవారం యాదగిరిగుట్ట మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఎస్ఐఆర్‌లో భాగంగా జరుగుతున్న ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం యాదగిరిగుట్ట పట్టణంలోని ఇందిరా కాలనీ పోలింగ్ కేంద్రం నెం.145లో ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఓటర్ల వివరాలు ఖచ్చితంగా నమోదు కావడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రత్యేక ఎస్ఐఆర్ సక్రమంగా రూపొందించాలని,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.

**ప్రభుత్వ వైద్య కళాశాల స్థలం పరిశీలన**

యాదగిరిగుట్టలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల స్థలాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన చేపట్టాల్సిన పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనులు ఎప్పటి నుండి ప్రారంభించారని అడగగా ప్రస్తుతం చేపడుతున్న ఏర్పాట్ల పనులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వైద్య కళాశాల భవనానికి సంబంధించిన నమూనా మ్యాప్‌ను పరిశీలించి,విద్యార్థులకు, వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట యాదగిరిగుట్ట తహశీల్దార్ గణేష్ నాయక్, మెడికల్,ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.



# సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు గడువును పెంచాలి

**జయభేరి, చెన్నూరు :**

కొటపల్లి మండల BRS సోషల్ మీడియా బాపు నాయక్ మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గం కోటపల్లి మండలంలో వివిధ గ్రామాల వేల ఎకరాల్లోనే నిలిచిన పత్తి పంట కొనుగోళ్ళు ఆపితే దళారుల రాజ్యం పాలవుతుందని పత్తి కొనుగోలు ప్రక్రియను మార్చి నెల చివరిదాకా కొనుగోలు సాగించాలని లేకుంటే పత్తి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతారని జిల్లాలో ఇప్పటికి 40% పత్తి రైతులు ఇండ్లలోనే నిల్వలుగా ఉందని వర్షాల కారణంగా, కూలీల కొరతతో పాటు రవాణా సమస్యల వల్ల పత్తి మొత్తం కొనుగోలు కేంద్రాలకు తరలించకపోయారని అధిక వర్షాలతో పత్తి ఉత్పత్తి ఆలస్యంగా జరిగిందని ఇప్పటికీ చేనులలో పత్తి ఉందని ఇలాంటి పరిస్థితుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను నిలిపివేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని కొనుగోలు కేంద్రాలు మూసివేస్తే ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలు చెప్పి రైతులను దోచుకునే అవకాశం ఉందని, ఇప్పటికే కొందరు వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువ కు పత్తి కొనుగోలు చేస్తున్నారని, పత్తి పండించడానికి రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారని, సరైన ధర రాకపోతే అప్పుల బారిన పడే ప్రమాదం ఉందని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కోతలు విధించకుండా పత్తి కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఏదైనా సమస్య ఉంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించుకొని మార్చి చివరి వరకు సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు గడువును పెంచాలని ఆయన కోటపల్లి మండల సోషల్ మీడియా బాపు నాయక్ డిమాండ్ చేశారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగొచ్చు?



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలంలో ఈపీడీసీఎల్ పరిధిలో గల పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉండొచ్చని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి మురలీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 220 కె.వి హై టెన్షన్ విద్యుత్తు లైన్స్ పనుల నిర్వహణలో భాగంగా 33 కెవి పరవాడ సబ్ స్టేషన్, 33 కెవి వాడ చీపురుపల్లి సబ్ స్టేషన్, 33 కెవి పెదమసిడివాడ సబ్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాలకు ఉదయం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడే అవకాశాలు ఉండొచ్చని తెలిపారు.పైన తెలిపిన సబ్ స్టేషన్ల పరిధిలో గల ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, ఒకవేళ విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లయితే సహకరించాలని ఈ ఈ మురలీకృష్ణ కోరారు.



# పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 11:**

యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు ఫలికారు. ఈ కార్యక్రమాన్ని 9వ తరగతి విద్యార్థులు అత్మియంగా ఏర్పాటు చేసి,పదో తరగతి విద్యార్థులకు తొలుత సాదర స్వాగతం ఫలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గవ్వల రాములు అధ్యక్షతన వహించారు. ఉపాధ్యాయులు,విద్యార్థులు శుభాకాంక్షలు తెలుపుతూ వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో చదువుకుంటే జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించుకోవచ్చని సూచించారు. ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వం తమ జీవితానికి బలమైన పునాదిగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా నాలుగువ వార్డు సభ్యులు కల్లెం రాజు 10 తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# హోటల్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 11:**

నిబంధనలు పాటించని హోటళ్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝళిపించారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తుర్కపల్లి, మజీద్ పూర్ లోని పలు హోటళ్ళను మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పరిశుభ్రత పాటించని హోటళ్లను గుర్తించి సుమారు 30 వేల రూపాయల జరిమానా విధించారు. మున్సిపల్ పరిధిలో పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. అనంతరం తండాలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, ఇంచార్జ్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జ్ ఆర్ ఓ వేణుగోపాల్, ఇంచార్జ్ ఆర్ ఐ విజయ్ కుమార్, మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కీసర సర్కిల్ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం




**జయభేరి, శామీర్ పేట్, మర్చి 11:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కీసర సర్కిల్ పరిధిలో శ్రమదానం నిర్వహించారు. ఇందులో భాగంగా పుట్ పాత్ లు, రోడ్డు డివైడర్ లను శుభ్రం చేశారు. అనంతరం కాలనీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారంతో పాటు, పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుందని, అధికారులు సమన్వయంతో పాలు పంచుకుంటూ ముందుకు సాగుతున్నారని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు.

# కొల్తుర్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- గ్రామంలో శ్రమదానం నిర్వహించిన మున్సిపల్ సిబ్బంది



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 11:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మూడు చింతల పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొల్తూరు వార్డ్ కార్యాలయంలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మోర్సుభాయి శశిరేఖ, మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్ లు పాల్గొన్నారు . అనంతరం రహదారులను శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అనే బృహత్తర కార్యక్రమం తీసుకువచ్చి గ్రామాల్లో పరిశుభ్రత కు పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉషా, రెవెన్యూ ఇన్స్పెక్టర్స్ గౌతమి & రాజేశ్వర్ రెడ్డి , శానిటరీ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్, మరియు వార్డ్ కౌన్సిలర్లు జి . మహేశ్వరి, జి జ్యోతి, జి రమేష్, మాజీ ఉపసర్పంచ్ ఎమ్ . రాంరెడ్డి, గ్రామస్తులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు పేదలకు వరం

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- లింగారెడ్డిగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ఎమ్మెల్యే శంకర్
- మాజీ ఎమ్మెల్యే బక్కని, ఎమ్మెల్యే శంకర్ ల అన్యోన్యత
- లింగారెడ్డిగూడెం సర్పంచ్ ఎంసి రాజు, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ ల కృతజ్ఞతలు
- రూ.30 లక్షలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



జయభేరి, షాద్ నగర్, మార్చి 11 :

ఇందిరమ్మ ఇల్లు పేదలకు వరం. గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు వరాల జల్లు అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో బుధవారం గృహప్రవేశం అంగరంగ వైభవంగా చేయించారు. కార్యక్రమం సందర్భంగా లింగారెడ్డిగూడెం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రావడంతో గ్రామవాసి స్థానిక మాజీ ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ తన ఆప్యాయతను చాటారు. ఎమ్మెల్యే శంకర్ సైతం అంతే వినమ్రంగ ఆయనకు నమస్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారు దంపతులకు నూతన వస్త్రాలు పెట్టి ఆశీస్సులు అందించారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.... నిరుపేదలను ఇంటి యజమానులను చేసే కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని దానిని అంకితభావంతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటిని అందించి వారికి గూడు చూపించే కార్యక్రమం మంచి కార్యక్రమం అని అభినందించారు. సర్పంచ్ ఎంసీ రాజు, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ కార్యక్రమంలో హాజరైన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రగతి పనులకు శంకుస్థాపన..**

అదేవిధంగా గ్రామంలో 30 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, దీపిక, వీరేష్ గౌడ్, మమత, అరుణ్, సాయికుమార్, బాలమణి, యాదయ్య, మాధవి, గణేష్, మెహరాజ్, శశాంక్, గ్రామ పెద్దలు కందూరి అంజయ్య గౌడ్, రంగంపల్లి రమేష్, భాస్కర్ రెడ్డి, పంతులు, లక్ష్మయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, సుధాకర్, ధనాల రాజు యాదవ్, ధనుంజయ గౌడ్, పక్కని శీను, యాదయ్య గౌడ్, మంగలి మల్లేష్, శంకరయ్య, అంజయ్య ప్రతాప రెడ్డి, దాదేమియా, జంగయ్య, నారాయణ, శీను, శేఖర్, యాదగిరి, ఖదీర్ ,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్
- లాల్ కోటలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

జయభేరి, దేవరకద్ర :

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు.దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం లాల్ కోటలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ. 30 లక్షల నిధులతో చేపట్టే ఆహార ధాన్యాల నిల్వ కేంద్రం (గోడౌన్) నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే రూ. 12 లక్షల నిధులతో చేపట్టే అంగన్వాడి భవన నిర్మాణానికి, 10 లక్షల నిధులతో చేపట్టే మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు



జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 11 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, ఉపాధ్యాయులు మీనాదేవి ,ఎండి రజియా సుల్తానా, నీల రమేష్, ఏఏపిసి చైర్మన్ రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష పాడ్స్, స్టేషనరీ అందజేసిన కనక నాగరాజు



జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 11 :

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీని బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనక నాగరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని 100% ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బాలమని ఉపాధ్యాయులు, గ్రామస్తులు పలుగుల శిరీష, దుడక కరుణాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 11 :

తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో బుధవారం మెడిసిటి హాస్పిటల్ మేడ్చల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దొనికెన రేణుక వెంకటేష్ యాదవ్ ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడిసిటీ హాస్పిటల్ వారి వైద్య సేవలను గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధు, వార్డు సభ్యులు వంగ కరుణాకర్ రెడ్డి, సంపత్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ నారాయణరెడ్డి ,మాజీ ఉపసర్పంచ్ సముద్రాల వెంకటేష్,ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్కే హుస్సేన్ చాడ మురళి రెడ్డి, నూకల మల్లేష్,నాంసాన్ యాదగిరి, తూటి కిష్టయ్య ,బూసి మల్లయ్య, మెడిసిటీ హాస్పిటల్ డాక్టర్ లలిత, డాక్టర్ చాందిని డాక్టర్ శ్రావణి, డాక్టర్ మౌనిక, ఝాన్సీ, ఫార్మసిస్ట్ కవిత, మార్కెటింగ్ సిబ్బంది రాఘవేందర్ రెడ్డి, సాయి కుమార్ పాల్గొన్నారు.

## ఇరాన్ పై దాడులపై కార్మిక సంఘాల నిరసన

జయభేరి, విశాఖపట్నం :

ఇరాన్ పై జరుగుతున్న దాడులను ఖండిస్తూ విశాఖలో అఖిలపక్ష కార్మిక సంఘాలు నిరసనకు దిగాయి.అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని, అమెరికా చర్యల వ్యతిరేకంగా గళమెత్తారు.ఐక్యరాజ్యసమితి స్పందించి భద్రతామండలిని సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దేశానికి రావాల్సిన ఆయిల్ ను నిలిపివేయడానికి కారణం అమెరికా అని,దీనిపై తక్షణమే మోదీ స్పందించి ఐక్యరాజ్యసమితికి లేఖ రాయాలని కోరారు.



## ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసిన ప్రజలు

- సమస్యలు తీర్చాలని వినతి
- కాంగ్రెస్ పార్టీలో కలిసిన పలువురు నాయకులు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ లోని ఎమ్మెల్యే జిఎంఆర్ స్వగృహంలో బుధవారం ఆయా మండలాలకు చెందిన పార్టీల నాయకులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చిన్నచింతకుంట మండలం బండర్ పల్లి గ్రామంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన వార్డు సభ్యులు గోపాల్, రాజు చారి, రామచంద్రయ్య లతోపాటు అప్పరాల గ్రామానికి చెందిన న్యాయవాది నాగిరెడ్డి తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే జిఎంఆర్ ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘనంగా సన్మానించారు.

## చిన్న చింతకుంట ప్రజా పాలనలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండల కేంద్రంలో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పిహెచ్సి ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుండి వచ్చిన ప్రముఖ వైద్యులతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. వారు ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మహిళా సంఘాల ఆధ్వర్యంలో గర్భిణీ మహిళల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పౌష్టికాహారం సంబంధించి తయారు చేసిన స్టాల్స్ ను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి. వెంకటన్న కుటుంబ సభ్యులను బుధవారం దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరామర్శించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓ మాజీ ప్రజా ప్రతినిధి అరాచకం

- మహిళా ఇంటిని కబ్జా చేసేందుకు యత్నం
- మాజీ సర్పంచ్ అరాచకం పై మహిళా నిరసన ర్యాలీ
- తనకు న్యాయం చేయాలని వేడుకోలు




జయభేరి, శామీర్ పేట్, మార్చి 11:

మాజీ ప్రజా ప్రతినిధి వేధింపుల నుండి తనను కాపాడాలంటూ తుంకుంటకు చెందిన ఓ మహిళ రోడ్డెక్కి నిరసనకు దిగింది. ఇక వివరాల్లోకి వెళితే తుంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ అక్రమాలు,అరాచకాల నుండి తనను కాపాడాలని కోరుతూ తుంకుంటలోని రెడ్డి కాలనీ కి చెందిన సునీత అనే మహిళా ప్లకార్డులతో తన ఇంటి నుండి తుంకుంటలోని జి హెచ్ఎంసి వార్డు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తుంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ తనకు సంబంధం లేని ఇంటి విషయంలో జోక్యం చేసుకొని ఆ ఇంటి నుండి తనను ఖాళీ చేయించి ఆ ఇంటిని కబ్జా చేయాలనీ ప్రయత్నం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.కొద్దీ రోజుల క్రితం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే తాను ఇవ్వను అని చెప్పడంతో ఇంట్లో లేని సమయంలో తన అనుచరులతో అక్రమంగా ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని వస్తువులు, నగదు, బంగారం మరియు విలువైన సర్టిఫికెట్లు అపహరించుకెళ్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు .ఈ విషయమై గతంలో శామీర్ పేట పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా అతని పై కేసు నమోదు చేశారే తప్పా ఇంతవరకు అతనిని అదుపులోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఒక ఎస్సీ మహిళ అని చిన్న చూపు చూస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. తాను డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన ఇంటిని అక్రమంగా కబ్జా చేయాలనీ ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికార పార్టీ కి చెందిన ఓ నాయకుడే అక్రమాలకు పాల్పడితే ఇంకా ప్రజలకు నాయకుల పై నమ్మకం ఎలా కలుగుతుందని వాపోయారు. తాను అధికార పార్టీకి చెందిన నాయకుడిని, మాజీ సర్పంచ్,అని మాజీ కౌన్సిలర్ అని నన్ను ఆపే దమ్ము ఎవరికి లేదు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడని కన్నీరు మున్నీరు అయ్యారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

## బాగా చదవాలి.. పైకి ఎదగాలి..

- విద్యార్థులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచన
- లాల్ కోటలో విద్యార్థులతో ఎమ్మెల్యే ఆప్యాయ పలకరింపు



జయభేరి, దేవరకద్ర :

విద్యార్థులు బాగా చదివి పైకి ఎదగాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) విద్యార్థులకు సూచించారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం లాల్ కోటలో బుధవారం వివిధ అభివృద్ధి పనుల భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే జిఎంఆర్ ఆప్యాయంగా పలకరించారు.

వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాలని ఎమ్మెల్యే జిఎంఆర్ విద్యార్థులకు సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టంగా చదవాలని సూచించారు.

పరీక్షలను ఆందోళనగా కాకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. ఎలాంటి వత్తిడిలకు గురికాకుండా ఉండాలన్నారు. ఈ సందర్భంగా చాలా మంది విద్యార్థులు ఎమ్మెల్యేతో కరచాలనం చేసి సంబరపడ్డారు. సందర్భంగా ఎమ్మెల్యే కూడా ఎంతో ఓపికతో కరచాలనం చేసి పలకరించారు.

## పురుషులలాగే మహిళలకు సమాన హక్కులు కల్పించాలి




జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 11 :

పురుషులలాగే మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ఇన్నర్ వీల్ భువనగిరి శాఖ అధ్యక్షురాలు లావణ్య అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని పిలుపు ప్రమోట్ చేసిన స్వర భారతి రైతు నేస్తం, ఒంటరి మహిళల సమైక్య ఇన్నర్ వీల్ క్లబ్ వారు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ,బాలికకు హక్కులు, న్యాయం జరిగేటట్లు కార్యాచరణ ఉండాలని అన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ మహిళల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. జిల్లా బాలల రక్షణ కమిటీ చైర్పర్సన్ జయశ్రీ ,కమిటీ సభ్యులు మాట్లాడుతూ పిల్లలు మహిళలపై హింస అన్యాయం వివక్ష లేని సమాజానికై మనమంతా పనిచేయాలని అన్నారు. పిలుపు ప్రమోట్ చేసిన స్వర భారతి, రైతు నేస్తం, ఒంటరి మహిళల సమైక్య ప్రతినిధులు మాట్లాడుతూ సమాజం ప్రభుత్వం ప్రతి వ్యక్తి కలిసి లింగ సమానత్వం కోసం చర్యలు తీసుకోవాలని మహిళలకు విద్య ఉద్యోగం నాయకత్వంలో మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు. పిలుపు సంస్థ వ్యవస్థాపకుడు ఎం జనార్ధన్ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం వారి కృషిని గుర్తించడం చాలా ముఖ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా ఒంటరి మహిళలైనా మల్కాపురం మరియమ్మను, పల్లెపహాడ్ సంధ్య ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు చాడ కరుణాకర్ రెడ్డి, మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు అంజయ్య, పిలుపు సంస్థ సిబ్బంది, గ్రామీణ మహిళలు 70 మంది పాల్గొన్నారు.

# విట్యాల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్

- హెడ్మాస్టర్ 'రవి' పై విద్యాశాఖ చర్యలు!
- స్వయంగా విచారణ జరిపిన విద్యాశాఖ డైరెక్టర్
- విచారణలో వెలుగులోకి సంచలన విషయాలు





జయభేరి

## సారూ.. జర మా స్కూల్ దిక్కు చూడ

- పాఠశాలకు రాని ప్రధానోపాధ్యాయుడు
- విట్యాల ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ ను వెంటనే సస్పెండ్ చేయాలి
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్

జయభేరి, షాద్ నగర్, మార్చి 10 :
విట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నటువంటి రవికుమార్ ప్రధానోపాధ్యాయుడు అసలు స్కూలుకే రావడం లేదని విద్యార్థులు మంగళవారం స్కూలుకు తాళం వేసి సర్పంచ్ ఇంటికి వెళ్లడం జరిగింది. ఈ విషయంపై ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన చదువు అందిస్తూ పరీక్షలలో ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడిమని

పాఠాలే బోధించకపోవడం చాలా బాధాకరం. విద్యార్థులకు రావాల్సినటువంటి స్నాక్స్ కూడా ఇవ్వనటువంటి పరిస్థితి ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను చదివించడానికి తల్లిదండ్రులు ఎందుకు ఆలోచిస్తున్నారో ఈ ఒక్క సంఘటన నను బట్టి మనకు అర్థమవుతోంది.హెచ్ఎం

ర్థులకు పాఠాలు చెప్పడం ఆపేసి ... మునిగి తేలుతూ ఉంటాడని విద్యా... తున్నారు. కాబట్టి రవికుమార్ పై ఉ... ధికారి విచారణ జరిపి సస్పెండ్ చేయ... ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ...

జయభేరి, షాద్ నగర్, మార్చి 11 :

తమ భవిష్యత్తు కోసం గ్రామ విద్యార్థులు చేసిన పోరాటం ఫలించింది. పాఠశాలకు సక్రమంగా రాకుండా, విద్యార్థుల చదువులను నిర్లక్ష్యం చేస్తున్న విట్యాల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రవిపై విద్యాశాఖ వేటు వేసింది. విద్యార్థులు , గ్రామస్తుల ఆందోళనతో కదిలిన యంత్రాంగం తక్షణమే విచారణ చేపట్టి సదరు హెచ్ఎంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫరూక్ నగర్ మండలం విట్యాల గ్రామంలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించే టీచర్ వ్యవహారంపై నిన్న విద్యార్థులు పాఠశాలకు తాళం వేసిన సంగతి విధితమే. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో, ఉన్నతాధికారులు నేరుగా రంగంలోకి దిగారు. తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ కమిషనర్ నవీన్ నికోలస్, జిల్లా విద్యాశాఖాధికారి సుసింధర్ రావు, ఫరూక్ నగర్ ఎంఈఓ మనోహర్ కలిసి బుధవారం విట్యాల ఉన్నత పాఠశాలను సందర్శించారు. అధికారుల బృందం విద్యార్థులతో, గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడి వాస్తవాలను తెలుసుకున్నారు.

### వెలుగుచూసిన హెచ్ఎం 'రవి' లీలలు

అధికారులు జరిపిన ఎంక్వైరీలో ప్రధానోపాధ్యాయుడు రవి గురించి షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. విద్యార్థుల వద్ద చేసిన డబ్బుల వసూళ్ల పర్వం వెలుగు చూసింది. స్కూల్లో ఒక్కో విద్యార్థి నుండి అకారణంగా 300 రూపాయల చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నట్లు విద్యార్థులు అధికారుల ఎదుట సాక్ష్యం చెప్పారు. దీనికి తోడు విద్యార్థుల పట్ల దురుసు ప్రవర్తన గ్రామస్తులతో, తల్లిదండ్రులతో కనీస మర్యాద లేకుండా ప్రవర్తించేవారని గ్రామస్తులు స్వయంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా గత కొంత కాలంగా విధులకు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఆంగ్ల పాఠాలు చెప్పకుండా, కేవలం ఆఫీసు పనుల పేరుతో నెలల తరబడి స్కూలుకు రాకుండా ముఖం చాటేసినట్లు విచారణలో తేలింది. అంతే కాకుండా విద్యార్థులపై దౌర్జన్యం చేస్తూ పాఠాలు అడిగిన విద్యార్థులపై కూడా దురుసుగా వ్యవహరించేవాడని ఎంక్వైరీలో స్పష్టమైంది.

### తక్షణమే సస్పెన్షన్ వేటు!

అన్ని కోణాల్లో విచారణ పూర్తి చేసిన అధికారులు, హెచ్ఎం రవి విధి నిర్వహణలో ఘోరంగా విఫలమయ్యారని నిర్ధారించారు. అక్రమ వసూళ్లు, నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తనపై వచ్చిన ఫిర్యాదులు నిజమని తేలడంతో.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హెచ్ఎం రవిని ఉన్న ఫలంగా సస్పెండ్ చేస్తున్నట్లు కమిషనర్ నవీన్ నికోలస్ ప్రకటించారు.



## కేకే కృష్ణ ఫౌండేషన్ ఔదార్యం

- ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేత
- కేకే కృష్ణ ఫౌండేషన్ సహకారంతో 400 మంది పేద విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ లు అందజేత

జయభేరి, షాద్ నగర్, మార్చి 11 :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి మూడు ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 400 మంది విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో కేకే కృష్ణ ఫౌండేషన్ వారి సహకారంతో ఎగ్జామ్ ప్యాడ్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహన్ , యూత్ కాంగ్రెస్ నాయకుడు నరేందర్ ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏఐఎస్ఎఫ్ నాయకులు, అశోక్, రాజేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, డ్యానిల్, ప్రసాద్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు




జయభేరి, చింతపల్లి :

శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వాహకులు 500 వందలు కొట్టు తులం బంగారం పట్టు అని వినూత్న ప్రయత్నం చేయగా డ్రాలో 686 నెంబర్ తీదేడు గ్రామానికి చెందిన కలగొని అంకులమ్మ చిన్న మల్లయ్య విజేతగా నిలిచారు.తులం బంగారం విజేత కలగొని చిన్న మల్లయ్య దంపతులకు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్ లు శాలువాతో సన్మానించి తులం బంగారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రతి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,గ్రామ పాలక వర్గం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్న మాద గోవర్ధన్ గౌడ్




జయభేరి, పీఏ పల్లి :

గౌరవ డాక్టరేట్ అవార్డు 2026 సంవత్సరమునకు గాను పి.ఏ.పల్లి మండలం. అక్కంపల్లి గ్రామానికి చెందిన మాద గోవర్ధన్ గౌడ్ అందుకున్నాడు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి విద్యార్థి దశలో నుండే డా.బి.ఆర్. అంబేద్కర్, స్వామి వివేకానంద లను ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవా దృక్పథంతో ఉంటూ ప్రభుత్వం చేపట్టిన అన్ని సేవా కార్యక్రమాలో చురుకుగా పాల్గొన్నాడు. కుటుంబ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ మొదలగు అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాడు , మహిళా సాధికారత,యువత సాధికారత, బాల్యవివాహాల నిర్మూలన మొదలగు అంశాలపై సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించేది.పేద విద్యార్థులకు చదువుల నిమిత్తం తగు సహాయం అందించడంలో ముందు ఉండేది.వృద్ధులకు,పేదలకు ఆరోగ్య శిబిరాలు నిర్వహించేది, మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం నిర్వాహణ మొదలగు సేవా కార్యక్రమాలతో పాటు ప్రజా ఉద్యమాలలో పాల్గొని ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేసినాడు. ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ స్పూర్తి అకాడమీ వారు గోవర్ధన్ గౌడ్ సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసినారు. మార్చి 10 , 2026 వ తేదీన హైదరాబాద్ లోని సిటీ కల్చరల్ ఆడిటోరియంలో ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ స్పూర్తి అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మెన్ లయన్ డా. ఆకుల రమేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాలనుండి రెండు వందల మంది డెలిగేట్స్ హాజరు అయినారు. ఈ సందర్భంగా ఆకుల రమేష్ మాట్లాడుతూ ముందు ముందు ఇలాంటి అవార్డు లు ఎన్నో అందుకోవాలని సూచించారు. అవార్డు గ్రహిత గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ నా యొక్క సేవలను గుర్తించి అవార్డు అందజేసినందుకు అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మెన్ లయన్ డా ఆకుల రమేష్ కి అందుకు సహకరించిన డా చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కి కృతజ్ఞలు తెలియజేశారు. ఈ అవార్డు రావడంతో నాకు సామాజిక సేవ పట్ల మరింత బాధ్యత పెరిగిందని, మా యొక్క సేవలను విశృతం చేస్తామని తెలియజేసినారు.



## నేలపై వార్డు నెంబర్.. సర్పంచ్ కుర్చీలో

- దళిత ప్రజాప్రతినిధికి దక్కని గౌరవం
- మర్యాద మంటగలిపిన ఐసిడిఎస్ అధికారులు

జయభేరి, వాజేడు, మార్చి 11 :

వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామంలో గల పేరూరు అంగన్వాడి సెంటర్ వన్ ను స్థానిక సర్పంచ్ గొడ్డె సరోజినీ దేవి స్థానిక వార్డు మెంబరు అరికిల్ల కౌసల్య సందర్శించగా కేవలం సర్పంచ్ ను మాత్రమే కుర్చీలో కూర్చోబెట్టి వార్డు మెంబర్ను నేలపైన కూర్చోబెట్టారు. దళిత ప్రజాప్రతినిధి కాబట్టే ఇలా అగౌరవపరిచారని దళిత సంఘాల నాయకులు మండిపడుతున్నారు. దళితులకు గౌరవం అంటే ఇలా ఉంటుందా? ప్రజాప్రతిని ఎవరైనా గౌరవించాల్సిందే కదా అటు సూపర్వైజర్ ఇటు సర్పంచ్ కుర్చీలో కూర్చొని వార్డు మెంబర్ను నేలపైన కూర్చోబెట్టడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళిత మహిళా ప్రజాప్రతినిధికి దక్కిన ఈ అమర్యాద పట్ల అంబేద్కర్ కలలు గన్న స్వరాజ్యం ఇదేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## నూతనంగా ఎన్నుకోబడిన కౌన్సిలర్లను సన్మానించిన మాజీ మంత్రి



జయభేరి, దేవరకొండ :

నూతనంగా ఎన్నుకోబడిన కౌన్సిలర్లను సన్మానించిన మాజీ మంత్రి,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందిన కౌన్సిలర్లను మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ లు సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ భద్రత, సైబర్ మోసాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం




జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 11 :

గ్రామీణ సమాజాభివృద్ధి, సమాజ సేవ కార్యక్రమాల్లో భాగంగా తుర్కపల్లి మండలం కొండాపురం, రుస్తాపురం గ్రామాల్లో అవుట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణగూడ ఆర్ బి వి ఆర్ ఆర్ ఉమెన్స్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ సమన్వయ కర్త డాక్టర్ పి ఝాన్సీ లక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్లైన్ మోసాలు ఎలా జరుగుతాయి. సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం ఎలా ఉండాలి. వ్యక్తిగత ఆర్థిక సమాచారాన్ని ఎలా రక్షించుకోవాలని అంశాలను వివరించారు .డిజిటల్ చెల్లింపులు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, సైబర్ నేరాలను ఎలా నివేదించాలో వివరించారు. నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు పై ప్రదర్శనను చేశారు విద్యార్థులు నోట్లలో ఉండే వాటర్ మార్క్ సెక్యూరిటీ థ్రెడ్ మైక్రో లెటర్ ఇన్ రంగు మారే ముద్రణ వంటి భద్రతా లక్షణాలను పరిశీలించడం ద్వారా నకిలీ నోటు ఎలా గుర్తించాలో వివరించారు. అదనంగా లంచగొండితనం అవినీతి నిరోధక పై అవగాహన కల్పించారు. నైతిక విలువలు పారదర్శకత బాధ్యతాయుతమైన పౌరసత్వం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివరాత్రి లావణ్య జహంగీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసింహారావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు.. ఉపాధ్యాయులైన వేళ..

- కోయిల్ సాగర్ లో స్వయం పరిపాలన దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల బోధనలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించి అందరిని అలరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. కలెక్టర్ గా పూజ, డి ఈ ఓ గా అభినబేగం, ఎంఈఓ సింధు, హెచ్ యం గణేష్, విద్యా కమిటీ చైర్మన్ గా జ్ఞానేశ్వరి లు వ్యవహరించారు. తదితర విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యా బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు వాటర్ సమస్యని పరిష్కరించిన సర్పంచ్




జయభేరి, కొండమల్లేపల్లి :

కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో 8 10 వార్డుల్లో పూడక పోయిన బోరుని మిషిని సహాయంతో బోరుని దగ్గర ఉండి కడిగించి ప్రజలకు వాటర్ సమస్యని పరిష్కరించిన సర్పంచ్ ఎండాకాలంలో ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడొద్దు అని అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండ మల్లేపల్లి గ్రామ సర్పంచ్ యుగంధర్ రెడ్డి వార్డు సభ్యులు గంట మల్లేష్ యాదవ్, బిజిలి లింగం, వార్డు ప్రజలు గ్రామ పంచాయతీ సిబ్బంది వార్డు ప్రజలు సర్పంచికి వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

# ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

- విద్యార్థులకు పరీక్ష కిట్లను అందచేసిన సామాజిక సేవకుడు బర్రెంకబాయి శ్రావంత్ రెడ్డి




జయభేరి, శామీర్ పేట్, మర్చి 11:

విద్యార్థులు ఒత్తిడినీ జయించి పరీక్షలకు సన్నద్ధం కావాలని ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి కార్పొరేషన్ పరిధి లోని దేవరాయాంజాల్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు బాలేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డితో పాటు రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నర్సింహారెడ్డి, సామాజిక సేవకుడు బర్రెంకబాయి శ్రావంత్ రెడ్డి లు హాజరయ్యారు. అనంతరం సామాజిక సేవకుడు బర్రెంకబాయి శ్రావంత్ రెడ్డి తన తండ్రి దేవేందర్ రెడ్డి జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు, జామెట్రీ బాక్స్ లు అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది శ్రావంత్ రెడ్డి నీ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 వ తరగతి పరీక్ష రాసే విద్యార్థులు ముందు భయాన్ని విడిచి శ్రద్ధతో పరీక్షలు రాయాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి అటు పాఠశాలకు ఇటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత్ నాయక్, రమేష్ చంద్ర, శ్రీనివాస్, శశిరేఖ, హేమలత, మంజుల, నిర్మల, జ్యోతి, నాగలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## మహిళను చావు నుండి కాపాడిన పోలీసులు

- ప్రజల మన్నలను పొందుతున్న సీఐ ప్రభాకర్

జయభేరి, నరసరావుపేట :

పల్నాడు జిల్లా నరసరావుపేట శ్రీనివాస్ నగర్ కు చెందిన అన్నం రమణ (55), భర్త కొండయ్య ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నప్పటికీ తగ్గకపోవడంతో కలత చెంది రైలుకింద పడేందుకు వెళ్లిన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన నరసరావుపేట టూ టౌన్ సీఐ చి. ప్రభాకర్ తన సిబ్బందిని పంపించి ఆమెను సురక్షితంగా తీసుకుని వచ్చి ఇంటికి చేర్పించారు. టూ టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నరసరావుపేట పట్టణ ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని స్థానికులు అభినందిస్తున్నారు. ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించే సీఐని ఇప్పుడే చూస్తున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

## చెత్త బుట్టలు పంపిణీ

జయభేరి, హోలగుంద :

మండలం పరిధిలో పెద్దహ్యాట గ్రామంలో బుధవారం చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేయడం జరిగింది ఇందులో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బోయ వీరేష్ రామ కురువ అడివప్ప కృష్ణ ఎల్లప్ప పంచాయతీ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన చెత్త బుట్ట లు ప్రజలు గ్రామంలో ఆరుబయట చెత్త ను వేయకూడదని అలాగే కాలువలో చెత్త వేయకూడదు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి చెత్త బుట్టిలో చెత్తను వేయాలి మీ ఇంటి వద్దకే రీక్షా బండిలో గ్రామస్తులు పాల్గొన్నారు



## జర్నలిస్టులకూ ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీం

- సీఎంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటాం
- టి డబ్ల్యూ జె ఎఫ్ నాయకులతో వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ

జయభేరి, హైదరాబాద్, మార్చి11 :

ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేస్తున్న ఆరోగ్య పథకాన్ని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకూ వర్తింపజేసే అంశంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అమలు చేస్తున్న హెల్త్ స్కీం ను జర్నలిస్టులు, వారి కుటుంబాలకు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూ జే ఎఫ్) బృందం బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి దామోదర్ రాజనర్సింహ ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ, జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో చర్చించి హెల్త్ పాలసీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రిని కలిసినవారిలో టి డబ్ల్యూ జె ఎఫ్ ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఈ.చంద్రశేఖర్, బి జగదీశ్వర్ ఉన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



జయభేరి, కాప్రా :

మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ లో BRS పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షుడు వంజరీ ప్రవీణ్ కరిప ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు కుటుంబం, సమాజం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతి రంగంలో మహిళలు ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్ శ్రీనివాస్ రెడ్డి గొల్లురి అంజయ్య స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రమజాన్ ఆత్మీయతతో ఇఫ్తార్ విందు

- ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హాజరు



జయభేరి, ఉప్పల్ :

బీరప్పగడ్డ డివిజన్‌లోని కెకేఆర్ గార్డెన్‌లో ఖురేషీ బ్రదర్స్ నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హాజరయ్యారు. పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు చిరంజీవి, మధు హాజరై అందరికీ రమజాన్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజలు, స్నేహితులు, ముస్లిం సమాజానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇఫ్తార్ విందులో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా పేద ముస్లిం మహిళలకు రమజాన్ కిరాణా కిట్లు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఖురేషీ బ్రదర్స్‌ను అభినందిస్తూ, అవసరమైన వారికి సహాయం చేస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

## మహిళా దినోత్సవం శుభాకాంక్షలు



జయభేరి, ఎల్బీనగర్ :

అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం ఉదయం సరూర్ నగర్ లోని గౌడ సంక్షేమ సంఘం భవనం నందు లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ.. ముందుగా సమావేశంనకు విచ్చేసిన మహిళాలకు మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు గృహిణిగానే కాకుండా, విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాలలో ఎదుగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా పోలీస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, స్థానిక మహిళలు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సమక్షంలో సొంతగూటికి చేరిన ముత్యాల సర్వయ్య

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ సాయి శివ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నాయకులు ముత్యాల సర్వయ్య తోపాటు వందలాది మంది నాయకులు బిఆర్ఎస్ పార్టీలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తూ పరిపాలన చేస్తోంది. రైతులకు రైతుబంధు వెయ్యకుండా రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం. పదేళ్లలో రైతులకు ఏ ఇబ్బంది కాకుండా కరోనా సమయంలో కూడా కేసీఆర్ రైతులను ఆదుకున్నారు. రైతుబంధు డబ్బులను ఎగ్గొడుతూ దేవుళ్ళ మీద ఒట్లు పెట్టి పబ్బం గడుపుతున్నడు రేవంత్ రెడ్డి. ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు రైతులకు స్వర్ణయుగం, అన్నదాతలు చాలా సంతోషంగా జీవించారు ఇప్పుడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో అరిగోసా పడుతున్నారు. యూరియా, కరంట్, నీళ్లు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. కేసీఆర్ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ అయితే.. రేవంత్ రెడ్డి విధ్వంసానికి కేరాఫ్ అడ్రస్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించి, అభివృద్ధి అంటే ఏంటో దేశానికే చూపించిన దార్శనికుడు కేసీఆర్. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా రాష్ట్రంలో విధ్వంసం తప్ప అభివృద్ధి శూన్యం. సంక్షేమ పథకాలన్నింటికీ కోత పడింది. నల్లగొండ జిల్లాలో మంత్రుల అవినీతి విశ్వరూపం బట్టబయలైంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం కాలం పూర్తయింది. ఆనాడు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, రేవంత్ రెడ్డి అందరూ బాండ్ పేపర్ల మీద రాసిచ్చి 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారు. కానీ, 100 రోజులు కాదు కదా.. 800 రోజులు పూర్తయినా ఇప్పటికీ ఆరు గ్యారెంటీలు అమలవుతున్న దాఖలాలు లేవు. ఎస్సీ డిక్లరేషన్ పేరిట దళితులకు 18% రిజర్వేషన్లు, ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని మోసం చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10,000, ఇంటర్ పాస్ అయితే రూ. 25,000, డిగ్రీకి రూ. 50,000, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి.. ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదు. కనీసం కేసీఆర్ ఇచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు కూడా రావడం లేదు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభకు సిద్దరామయ్య ని తీసుకొచ్చి, బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని, ఏటా రూ. 20,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపింది. వరంగల్ సభలో రైతు డిక్లరేషన్ అని చెప్పి రాహుల్ గాంధీ మాయమాటలు చెప్పారు. ఏటా రూ. 15,000 రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసింది. గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ రూ. 2,000 చేశారు. కానీ కాంగ్రెస్ నేతలు తాము డిసెంబర్‌లో గెలిచిన మరుసటి నెల నుంచే రూ. 4,000 ఇస్తామని హామీ ఇచ్చారు. 28 నెలలు గడుస్తున్నా ఆ 4000 పెన్షన్ రాలేదు. మహిళలందరికీ నెలకు రూ. 2,500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఇప్పటిదాకా ఒక్క మహిళకు కూడా ఆ డబ్బులు ఇవ్వలేదు. తక్షణమే ఈ బడ్జెట్‌లో మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చేలా నిధులు కేటాయించాలి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఇప్పటికీ కూలీలకు డబ్బులు అందలేదు, పంటల బీమా రాలేదు. యువత కోసం ప్రవేశపెడతామన్న రాజీవ్ యువ వికాసం అమలు కాలేదు. ఏ ఒక్క యువతీ యువకుడికి ఒక్క రూపాయి కూడా సహాయం చేయలేదు. బడ్జెట్‌లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారు. కనీసం ఈ బడ్జెట్‌నైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలి. రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా ఈ బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలి అని అన్నారు.




- తాగుడుకు బానిసై.. పసిబిడ్డను అమ్మిన కన్నతల్లి

జయభేరి, మెదక్ జిల్లా :

మెదక్ జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. హవేలీ ఘనపూర్ మండలం లింగసానిపల్లి తాండాకు చెందిన మంజూల అనే మహిళ మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే మద్యానికి బానిసైన మంజూల దగ్గర తాగడానికి డబ్బులు లేకపోవడంతో ఆమె ప్రియుడు మహిపాల్‌తో కలిసి కన్నబిడ్డను కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ దంపతులకు రూ.1.70 లక్షలకు అమ్మింది. మగశిశువు పుట్టిన వారం రోజులకే ఈ దారుణం జరిగింది. బాలింతకు ఇవ్వాల్సిన ఆహార పదార్థాలు తీసుకోవడానికి ఎవరూ రాకపోవడంతో అంగన్‌వాడీ టీచర్ అనుమానంతో అధికారులకు సమాచారం ఇవ్వగా విషయం వెలుగులోకి వచ్చింది. అధికారులు శిశువును స్వాధీనం చేసుకొని సఖి కేంద్రానికి తరలించారు.

## ఘట్కేసర్ లో నెలకొన్న నీటి ఎద్దటికి నివారణ



జయభేరి, ఘట్కేసర్ :

గ్రేటర్ మల్కాజ్గిరి కార్పొరేషన్ ఉప్పల్ జోనల్ ఘట్కేసర్ సర్కిల్ అధికారులు మంచినీటి సమస్య పై స్పందించడం జరిగింది. ఎట్టకేలకు బ్రుక్ బాండ్ ఫ్యాక్టరీ నుండి మంచినీటి పైప్ లైన్ వేయడానికి పది లక్షల రూపాయలు వెచ్చించి టెండర్ కాల్ ఫర్ చేయడం జరిగింది. ఇట్టి మంచినీటి పైప్ లైన్ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని అధికారులు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఘట్కేసర్ లో నెలకొన్న నీటి ఎద్దటి నివారణ పరిష్కార మార్గాలను అధికారుల దృష్టికి తేవడం జరిగింది. ఇట్టి సమస్యను మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి దృష్టికి తేవడంతో అప్పటికప్పుడే బ్రూక్ బాండ్ ఫ్యాక్టరీ బావి నుండి ఘట్కేసర్ ప్రజలకు నీటి సరఫరా చేయడం ఒకటి మార్గమని తెలియడంతో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డితో మాట్లాడి బావి నుండి నీటిని తీసుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేద పైళ్ల శేఖర్ రెడ్డి ద్వారా NOC ఇప్పించడం జరిగింది. ఘట్కేసర్ ప్రజల మంచినీటి ఎద్దటి నివారణకు తెలిపిన వెంటనే సహకరించిన మాజీ మంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డికి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డికి ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

- ఆర్.వి (RV) ఫౌండేషన చైర్మన్ తుంగతుర్తి రవి
- విద్యార్థులకు ప్యాడ్ లతో పాటు పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్ అందచేత
- విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలి

జయభేరి, మేడిపల్లి :



విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి (RV) ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్, 9వ డివిజన్ మేడిపల్లి, 10వ డివిజన్ పీర్జాదిగూడ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆర్.వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన పరీక్ష ప్యాడ్‌లతో పాటు పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ పదో తరగతి అనేది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే తొలి మెట్టు అని, ఈ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని ఆయన తెలిపారు.పరీక్షల పట్ల భయం వీడి, పూర్తి ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. పేద విద్యార్థులకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే ఆర్.వి ఫౌండేషన్ ద్వారా ఈ చిన్న సహాయం అందిస్తున్నామని, భవిష్యత్తులో విద్యార్థుల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించి, తమ తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ స్కూల్ ప్రధానోపాధ్యాయులు (MEO)శ్రీనివాస్ రెడ్డి, మేడిపల్లి ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ మజర్, నాగరాజు, బర్రె నాగరాజు, శరత్ గౌడ్, ప్రభంజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- బీరప్ప గడ్డ డివిజన్లో 28 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

జయభేరి, ఉప్పల్ :



బీరప్ప గడ్డ డివిజన్లోని శ్రీ రాఘవేందర్ నగర్ కాలనీలో మరియు రాఘవేంద్ర నగర్ ఈస్ట్ కళ్యాణపురి కాలనీలో 28 లక్షల రూపాయలతో పలు సీసీ రోడ్డు పనులకు ముఖ్య అతిథులుగా విచ్చేసి శంకుస్థాపన చేసిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, అనంతరం వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన బీరప్ప గడ్డ డివిజన్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని ఇంకా చేయవలసిన పనులన్నీ కూడా ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతామని ఎక్కడ కూడా మట్టి రోడ్లు లేకుండా అన్ని సిసి రోడ్లుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తామని అన్నారు, అనంతరం మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ.. డివిజన్లో సుమారు 126 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసుకోవడం జరిగిందని సుమారు 90 శాతం పనులు పూర్తి చేసుకున్నామని మిగిలిన 10 శాతం పనులను కూడా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో పూర్తి చేస్తామని ఎన్నికల సమయాన ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు, ఎద్దుల కొండల్ రెడ్డి,కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, మాస శేఖర్, ఎండి షఫీ ఎండి హనీఫ్,ఎండి గౌస్, శ్యామ్, జిల్లెల్ల ప్రవీణ్, బాలు,మార్కా శీను, రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మోహన్ రెడ్డి ప్రొఫెసర్ రాములు, అజయ్, ముకుందరావు, Dr గావాలి, రాజేంద్రప్రసాద్, గోపి, జానకి, శారద, సుదేశ్ సింగ్, రంజిత్,అశోక్, శ్రీనివాసరావు, గంగాధర్ గౌడ్ సుధాకర్ రెడ్డి, సందీప్, మురళీకృష్ణ ,కిరణ్, మాధవరావు మొదలగువారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తివారీ ప్రమాణ స్వీకారం

జయభేరి, చెన్నూరు:




చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేశ్ ప్రసాద్ తివారీ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి హాజరయ్యారు. మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మహేశ్ ప్రసాద్ తివారీతో పాటు కమిటీ సభ్యులు కూడా పదవీ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్తగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, సభ్యులకు అభినందనలు తెలిపారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా మార్కెట్ కమిటీ పని చేయాలని సూచించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. కొత్త చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.



# కరివేపాకు హెయిర్ స్ప్రే..
# ఇలా చేస్తే జుట్టు వద్దన్నా పెరుగుతుంది..!

ప్రస్తుతం జుట్టు రాలడం అనే సమస్య అందరినీ వేధిస్తోంది. ఆడ, మగ అని తేడా లేకుండా ఈ సమస్యను అందరూ ఫేస్ చేస్తున్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం, ఒత్తిడి ఇలా అనేక కారణాల వల్ల జుట్టు రాలడం, లేదా చిన్న వయసులోనే తెల్ల జుట్టు రావడం సమస్య అనేకమందిని వేధిస్తోంది. అయితే ఈ సమస్యను పరిష్కరించుకోవడం కోసం అనేక రకాల షాంపోలు, ఇతర హెయిర్ ఆయిల్స్ వాడుతుంటారు. అయితే పలు కారణాల వల్ల ఈ సమస్య తగ్గకపోగా అధికమవుతూ వస్తోంది.

అయితే ఇప్పుడు ఈ సమస్యకు వంటింట్లోనే బెస్ట్ చిట్కా ఉందని మీలో చాలా మందికి తెలియదు. మనం రోజూ వాడే పదార్థాలతోనే ఈ జుట్టు రాలుట సమస్యకు బెస్ట్ రెమెడీని తయారు చేసుకోవచ్చు. ప్రతి ఇంట్లో సులభంగా లభ్యం అయ్యే కరివేపాకుతో ఈ సూపర్ మెడిసిన్ ను తయారు చేసుకోవచ్చు. కరివేపాకులో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. కరివేపాకు జుట్టుకు చాలా మేలు చేస్తుంది. కరివేపాకును వాడటం వల్ల జుట్టును నల్లగా, మందంగా మారుతుంది. అంతేకాక జుట్టును ఒత్తుగా చేయడానికి కరివేపాకు ఎంతో సాయపడుతుంది.

కరివేపాకులోని విటమీన్ సీ, ఐరన్, కాల్షియం, యాంటీ ఆక్సిండెంట్స్ అలాగే అమైనో యాసిడ్స్ కారణంగా జుట్టు రాలిపోవడం ఆగడమే కాకుండా.. జుట్టు మళ్లీ మందంగా, బలంగా మారుతుంది. మరి కరివేపాకుతో ఈ హెయిర్ స్ప్రేను ఎలా తయారు చేసుకోవాలి..? కరివేపాకుతో పాటు ఇంకా ఏఏ పదార్థాలు కావాలి..? కరివేపాకు హెయిర్ స్ప్రే తయారీ విధానం ఏంటి..?

కరివేపాకు నూనె తయారీకి ఒక గుప్పెడు కరివేపాకు రెమ్మలు, అర కప్పు కొబ్బరి నూనె తీసుకోవాలి. కొబ్బరి నూనెను ఓగిన్నెలో పోసి వేడి చేయాలి. ఆ తర్వాత దానిలో కరివేపాకు వేసుకోవాలి. అలా ఆకులు నల్లగా మారేంతవరకూ ఈ నూనెను తక్కువ మంట మీద ఉడికించుకోవాలి. ఆ తర్వాత గ్యాస్ ఆఫ్ చేసుకుని నూనెను చల్లబరచాలి. ఇప్పుడు ఆ నూనెను వడకట్టుకోవాలి. ఆ స్వచ్ఛమైన కరివేపాకు నూనెను గాలి దూరని ఓ గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఇక ఈ నూనెతో వారానికి 23 సార్లు తలకు మసాజ్ చేసుకోవాలి. అలా ఒక 1 గంటపాటు పెట్టుకుని ఆ తర్వాత కడిగేసుకోవాలి.



# వేసవిలో బీర్ తాగుతున్నారా..


మద్యం ఆరోగ్యానికి హానికరం. అయినా, మద్యం విక్రయాలు ఏ మాత్రం తగ్గటం లేదు. మద్యంలో అనేక రకాల బ్రాండ్లు ఉన్నాయి. యువత ఎక్కువగా బీర్ తాగుతూ వీకెండ్ వైబ్స్ ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. బీర్లు ఎక్కువగా తాగడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బీర్లలో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ అతిగా సేవిస్తే మాత్రం అనర్థాలు తప్పవని చెబుతు న్నారు.

బీర్లు అతిగా తాగితే అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. చాలా మంది బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నామని భావిస్తూ ఉంటారు. కానీ, బీర్ లో కూడా ఆల్కహాల్ ఉంటుంది. ఇది మన ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. బీర్ తాగడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. ఎముకలు బలహీనంగా తయారవుతాయి. 35 సంవత్సరాలు దాటిన తరువాత ఎముకల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళలు బీర్ తాగడం వల్ల హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తుతాయి. పురుషులు బీర్ తాగడం వల్ల వారిలో ఛాతి పెరుగుతుంది.

బీర్ తాగడం వల్ల మూత్రవిసర్జన పెరుగుతుంది. దీంతో శరీరం డీహైడ్రేషన్ బారిన పడుతుంది. తలతిరగడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ లో ఉండే ఆల్కహాల్ పేగులో ఉండే పొరలను చికాకుకు గురి చేస్తుంది. బీర్ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీర్ఘ కాలం పాటు బీర్ తాగడం వల్ల సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, ఆల్కహాలిక్ హెపటైటిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కాలక్రమేణా మెదడు పనితీరు కూడా దెబ్బతింటుంది.

పరిమితికి మించితే సమస్యలు తప్పవు ఎక్కువగా బీర్ తాగడం వల్ల గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. కనుక బీర్ ను తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. బీర్ తాగే అలవాటును ఒక్కసారిగా మానేయలేని వారు ఈ అలవాటును క్రమంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.

బీర్ వంటి ఆల్కహాల్ కలిగిన పానీయాలను ఆరు నెలల పాటు తీసుకోకపోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంలో పెద్ద మార్పులను చూడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. బీర్ ను మానేయడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాల ను పొందవచ్చని సూచిస్తున్నారు. మద్యానికి బానిసైన వారికి నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. తొలుత మత్తులో నిద్రపోయినా తర్వాత వారికి నిద్రాభంగం జరుగుతుంది. దీని వల్ల సరైన నిద్ర ఉండదు. మరుసటి రోజు అలసట, మానసిక ఒత్తిడికి గురవుతారు. బీరులో క్యాలరీలు అధికంగా ఉండటం వల్ల త్వరగా బరువు పెరుగుతారని, తద్వారా ఊబకాయం సమస్య బారిన పడతారని చెబుతున్నారు. అలాగే శరీరంలో కొలెస్ట్రాల్ శాతం పెరుతుందని హెచ్చరిస్తున్నారు.



# రోజూ 45 నిమిషాలు వాకింగ్

## జీవితంలో జరిగే అద్భుతమైన మార్పు ఏంటో తెలుసా!

**ఆరోగ్యంగా ఉండాలంటే జిమ్‌కి వెళ్లి గంటల తరబడి చెమటలు చిందించాలనో, కష్టతరమైన వ్యాయామాలు చేయాలనో చాలామంది భావిస్తుంటారు. కానీ, ఆడంబరాలు లేని అతి సాధారణమైన 'నడక' మన జీవితంలో ఎంతటి మార్పు తీసుకువస్తుందో ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్ కోర్ట్నీ నిరూపించారు. కేవలం 45 రోజుల పాటు, రోజుకు 45 నిమిషాల నడక ఆమె శారీరక, మానసిక స్థితిని ఎలా మార్చేసిందో తెలుసుకుందాం..**

మనం ఏదైనా సాధించాలంటే తీవ్రమైన శ్రమ ఉండాలని అనుకుంటాం. కానీ, ఫిట్‌నెస్ విషయంలో తీవ్రత కంటే 'నిలకడ' ఎక్కువ ఫలితాలను ఇస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 'కోర్ట్నీస్ హెల్త్ కార్నర్' నడిపే కోర్ట్నీ, తన 45 రోజుల నడక ప్రయాణాన్ని పంచుకున్నారు. ఇది కేవలం బరువు తగ్గడం గురించి మాత్రమే కాదు, జీవితంపై ఆమె దృక్పథాన్ని మార్చిన ఒక అద్భుత ప్రయాణం.

### క్రమశిక్షణకు పునాది

ప్రతిరోజూ 45 నిమిషాల పాటు నడవాలనే నిశ్చయించుకోవడం కోర్ట్నీలో ఒక తెలియని ఉత్సాహాన్ని నింపింది. తనకు తాను ఇచ్చుకున్న మాటను నిలబెట్టుకోవడం వల్ల ఇతర పనుల్లో కూడా క్రమశిక్షణ పెరిగింది. "రోజువారీ నడక నా జీవితంలోని ఇతర పనులను సులభతరం చేసింది. ఒక మంచి ఎంపిక మరో మంచి నిర్ణయానికి దారితీసింది" అని ఆమె వివరించారు.

ఈ చిన్న అలవాటు ఆమెలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపింది. నడక అనేది కోర్ట్నీకి కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది ఒక 'మీటైమ్'. గందరగోళంగా ఉన్న మనసుతో నడక మొదలుపెట్టినా, ముగించే సమయానికి చాలా ప్రశాంతంగా, ఉల్లాసంగా అనిపించేదట. కుటుంబ సభ్యుల సహకారంతో ఎలాంటి అంతరాయం లేని ఈ సమయం ఆమెలోని ఒత్తిడిని తగ్గించి, మానసిక స్పష్టతను ఇచ్చింది.

### పెరిగిన శారీరక సామర్థ్యం..

మొదట్లో ట్రెడ్‌మిల్ మీద కొంచెం వాలు కూడా కష్టంగా అనిపించిన కోర్ట్నీకి, 45 రోజుల నిరంతర సాధనతో 5 నుండి 10 శాతం వాలును కూడా సులభంగా అధిగమించే స్టామినా పెరిగింది. క్రమం తప్పకుండా చేసే చిన్న ప్రయత్నం కూడా కాలక్రమేణా గొప్ప శారీరక శక్తిని ఇస్తుందని ఆమె నిరూపించారు. ఒక ఉపాధ్యాయురాలిగా ఉన్న కోర్ట్నీకి, నడక సమయంలో కొత్త ఆలోచనలు రావడం మొదలైంది.

స్క్రీన్లకు, బాధ్యతలకు దూరంగా నడుస్తున్నప్పుడు ఆమె మెదడు స్వేచ్ఛగా ఆలోచించి, పాఠ్యాంశాల ప్రణాళికలు, సమస్యల పరిష్కార మార్గాలను కనుగొనేది. నడక అనేది మెదడుకు విరామ సమయంలా పనిచేసి, సృజనాత్మకతను పెంచిందని ఆమె పేర్కొన్నారు.

పెద్ద పెద్ద మార్పుల కంటే స్థిరంగా చేసే చిన్న పనులే జీవితాన్ని మారుస్తాయి. ఖరీదైన జిమ్ మెంబర్‌షిప్‌లు, కష్టమైన డైట్‌లు లేకుండానే కేవలం 'నడక'తో కోర్ట్నీ తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకున్నారు. మీరు కూడా మీ జీవితంలో మార్పు కోరుకుంటున్నారా? అయితే, ఈరోజే ఒక చిన్న అడుగు వేయండి!





# గ్లామర్ షోతో టాలీవుడ్‌పై ఫోకస్..

టాలీవుడ్‌లో మన దగ్గర తెలుగమ్మాయిలు స్టార్స్ అయిన సందర్భాలు చాలా తక్కువే. నార్త్ నుంచి వచ్చిన భామలకే మనోళ్లు రెడ్ కార్పెట్ పరుస్తుంటారు. ఫరియా కూడా తన కెరీర్ మొదలైనప్పటి నుంచి చిన్న హీరోలతో అవకాశాలు అందుకుంటుంది కానీ.. బ్రేక్ ఇచ్చి కెరీర్ మార్చేసే అవకాశం మాత్రం ఇప్పటి వరకు రాలేదు. అసలు ఫరియా చేసిన సినిమాలు ఎన్ని..? అని లెక్కలేస్తే.. 2021లో 'జాతిరత్నాలు'తో సూపర్ హిట్ కొట్టాక ఆమెకు ఆ రేంజ్ సక్సెస్ రాలేదు. ఆ తర్వాత 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', 'బంగార్రాజు', 'కల్కి 2898 AD' లాంటి సినిమాల్లో చిన్న చిన్న క్యామియోలు, స్పెషల్ సాంగ్స్ చేసింది. ఇక ఫుల్ లెంగ్త్ హీరోయిన్‌గా 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్', 'రావణాసుర', 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాలు ఆడలేదు. 'మత్తు వదలరా 2'.. ఆడినా ఆమెకు వర్కవుట్ అవ్వలేదు. మొత్తంగా ఒక 8,9 సినిమాల్లో మాత్రమే నటించింది. అయితే వీటిలో కొన్ని హిట్స్ ఉన్నా కూడా ఆ క్రెడిట్ అంతా హీరోలకే వెళ్లింది కానీ.. హీరోయిన్‌గా ఫరియాను టాప్ లీగ్‌లో కూర్చోబెట్టలేకపోయాయి. అందుకే గ్లామర్ వైపు ఎందుకు టర్న్ తీసుకుంది అనే దానికి క్లియర్ కట్ ఆన్సర్ ఆమె కెరీర్ గ్రాఫ్‌లోనే ఉంది. కేవలం పద్ధతిగా, నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రమే చేస్తే క్యారెక్టర్ రోల్స్ లేదా చిన్న సినిమాలే వస్తాయని ఈ బ్యూటీకి బాగా అర్థమైనట్లుంది. అందుకే తనలో కూడా కమర్షియల్ యాంగిల్ ఉందని మేకర్స్‌కు గట్టిగా హింట్ ఇవ్వడానికే గ్లామర్ డోర్స్ పూర్తిగా ఓపెన్ చేసింది. ప్యాన్ ఇండియా రేంజ్ సినిమాల్లో స్టార్ హీరోల పక్కన మాస్ సాంగ్స్ చేయాలన్నా, బీచ్‌లలో బికినీలు వేయాలన్నా తను రెడీ అన్నట్లుగా సిగ్నల్స్ ఇస్తోంది. మొత్తానికి ఇండస్ట్రీలో నిలబడాలంటే ఆ మాత్రం ఎక్స్‌పోజింగ్ తప్పదన్న ఫార్ములాను ఫరియా గట్టిగానే వంటపట్టించుకుని బరిలోకి దిగింది. అయితే టాలెంట్ ఉండి, గ్లామర్ ఒలకబోసినా.. ఇండస్ట్రీలో క్లిక్ అవ్వాలంటే టైమ్ కూడా కలిసి రావాలి. మరి అందాలు ఆరబోస్తూ ఫరియా చేస్తున్న ఈ గ్లామర్ షో అవకాశాలు తెచ్చి పెడుతుందా..? స్టార్ హీరోల పక్కన కమర్షియల్ హీరోయిన్‌గా సెట్ అవ్వాలన్న ఈ తెలుగమ్మాయి కల నెరవేరుతుందా..? అనేది రాబోయే రోజుల్లో తేలిపోనుంది.



# ఉగాది కానుకగా 'ఉస్తాద్ భగత్ సింగ్'..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న తాజా చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల విడుదలైన OG సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు మరో మాస్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా గతంలో గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్‌ను అందించిన పవన్ కళ్యాణ్-హరీష్ శంకర్ కాంబినేషన్ మళ్లీ కలిసి పని చేయడం అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిప్యూటీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉండటంతో సినిమా ప్రమోషన్స్‌లో ఎక్కువగా పాల్గొనలేరని తెలుస్తోంది. అయినప్పటికీ అభిమానులను నిరాశపరచకుండా కనీసం ఒక భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాత్రం పాల్గొనాలని నిర్ణయించినట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్ ఈవెంట్ మార్చి 15న ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను చిత్ర యూనిట్ త్వరలో విడుదల చేసే అవకాశముంది. ఈ ఈవెంట్‌కు భారీ సంఖ్యలో అభిమానులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఇటీవల 'OG' విజయోత్సవ కార్యక్రమం తర్వాత మళ్లీ సినిమా ఈవెంట్‌లో పవన్ కళ్యాణ్ కనిపించబోతుండటంతో అభిమానులు మరింత ఉత్సాహంగా ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సినిమా గురించి ఏమి మాట్లాడతారు? అభిమానులకు ఏ సందేశం ఇస్తారు? అనే విషయాలు ఆసక్తికరంగా మారాయి. మొత్తానికి 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు ముందు జరిగే ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ సినిమాపై అంచనాలను మరింత పెంచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఉగాది కానుకగా విడుదల కానున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సెన్సేషన్ సృష్టిస్తుందో చూడాలి.

# 'దేవర 2'కు ముహూర్తం ఖరారైందా?



పానిండియా బ్లాక్‌బస్టర్ 'ఆర్ఆర్ఆర్' తర్వాత తారక్ నుంచి వచ్చిన సినిమా 'దేవర'. రాజమౌళి సినిమా చేసిన హీరోకు వెంటనే హిట్ రావడం అసంభవం అనుకునే రోజుల్లో, ఆ సెంటిమెంట్‌ని బ్రేక్ చేసి, 500కోట్ల వసూళ్లు సాధించి, సోలో హీరోగా తారక్ కెరీర్‌లోనే వసూళ్ల పరంగా బెస్ట్‌గా నిలిచింది 'దేవర'. ఈ సినిమా సీక్వెల్ కోసం ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఎన్టీఆర్‌కు ఉన్న కమిట్‌మెంట్ల వల్ల ఈ సినిమా ఆలస్యం అవుతూవచ్చింది. అయితే.. ఎట్టకేలకు ఈ సినిమాపై నిర్మాత సుధాకర్ మిక్కిలినేని క్లారిటీ ఇచ్చారు. 'దేవర 2' రెగ్యులర్ షూటింగ్ మే నుంచి మొదలుకానున్నదని ఆయన తెలిపారు. ప్రస్తుతం తారక్ 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్) సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. దర్శకుడు ప్రశాంత్‌నీల్ తన గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాను కూడా రెండు భాగాలుగా తీస్తున్నాడని వినికిడి. త్వరితగతిన ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసి, మే నుంచి 'దేవర 2' సెట్‌లోకి తారక్ ఎంట్రీ ఇస్తారట. కథలో భారీగా మార్పులు జరిగాయని, షూటింగ్ షెడ్యూల్ కూడా ఫైనల్ అయ్యిందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని చిత్రబృందం చెబుతున్నది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ విలన్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే.

# నాగార్జునకు నేనంతగా తెలియదు..





గతేడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. ప్రస్తుతం అభిమానులు, మూవీ లవర్స్ ఫోకస్ అంతా నాగార్జున కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పైనే ఉంది. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్‌డైరెక్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అప్‌డేట్ ఎప్పుడెప్పుడొస్తుందా..? అని ఎదురుచూస్తున్న వారిలో రా కార్తీక్ చేసిన కామెంట్స్ జోష్ నింపుతున్నాయి. రా కార్తీక్ ఓ చిట్ చాట్‌లో మాట్లాడుతూ.. 40 ఏండ్లకుపైగా సినీ కెరీర్‌లో నాగార్జున ఎన్నో రికార్డులను బద్దలు కొట్టారు. ఆయన ప్రియదర్శన్, మణిరత్నంతోపాటు పలువురు మలయాళ దర్శకులను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేశారు. ఆయన చాలా అంశాలను ప్రేక్షకులను చూపించారు. తమిళ ఫిల్మ్ మేకర్స్‌తో కూడా నాగార్జున విస్తృతంగా పనిచేశారు. కాబట్టి నేను ఎక్కడి (ఏ ఇండస్ట్రీ) నుండి వస్తున్నాననే విషయంలో ఆయనకు ఎటువంటి సమస్య కనిపించలేదని చెప్పుకొచ్చాడు రా కార్తీక్.

సినిమా షూటింగ్ ఇప్పటికే మొదలైంది. అధికారిక ప్రకటన త్వరలోనే ఉండబోతుంది. ఇది నాగార్జున సినిమానే.. కానీ 100వ సినిమా అని ఖచ్చితంగా చెప్పలేను. 'నిథమ్ ఒరు వానం' ఒక నిర్దిష్ట జీవితం గురించి ఉంటే.. ఈ ప్రాజెక్ట్ అంతా మరో జీవితం గురించి సాగుతుంది. జోనర్ విషయానికొస్తే యాక్షన్, క్రూరత్వంతో కూడిన ఎలిమెంట్స్ ఉంటాయి. నాలో చూడని మరో కోణాన్ని బయటపెట్టానని అనుకుంటున్నా. ఏ స్థాయిలో యాక్షన్ ఉంటుందో.. అందుకు కనెక్ట్ అయ్యే భావోద్వేగాలు కూడా ఉంటాయన్నాడు రా కార్తీక్. అంతేకాదు ఈ ప్రాజెక్ట్ వర్కవుట్ అవ్వడానికి కేవలం నమ్మకమే కారణమని డైరెక్టర్ రా కార్తీక్ అన్నాడు. ఆయన (నాగార్జున)కు నేనంతగా తెలియదు. కానీ నాపై ఆయనకున్న నమ్మకం వల్లే ఇది సాధ్యమైంది. ఒకవేళ నేను ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటే చాలా మంది కొత్త దర్శకులు కూడా స్టార్ యాక్టర్లను సంప్రదిస్తారు.. వాళ్లు కూడా కథలు వింటారు. నేను ఈ విషయాన్ని బ్రేక్ చేయాలనుకోవడం లేదు. ఇది నాగార్జున సార్‌లోని మరో డైమన్షన్‌ను చూపించే పక్కా తెలుగు సినిమా.. అని చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. యూనిక్ స్టోరీ టెల్లింగ్, థ్రిల్లింగ్ కథనాలతో తనదైన మార్క్ చూపించే రా కార్తీక్ నాగార్జున కెరీర్ మైల్‌స్టోన్ సినిమాకు దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ క్రేజీ డైరెక్టర్ ఇంతకీ నాగ్ కోసం ఎలాంటి కథను సిద్ధం చేశాడు. కూలీలో తొలిసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించిన నాగార్జున మరి రా కార్తీక్‌తో ఎలాంటి కథ చేయబోతున్నాడన్నది సస్పెన్స్ నెలకొంది.



# రవితేజ సినిమాలో కీలకంగా..

ఓ అరడజను హిందీ సినిమాల్లో ప్రస్తుతం భాగమై ఉన్నది ముంబయ్ సోయగం తమన్నా భాటియా. వీటిలో కీలక పాత్రల్లో నటిస్తున్న సినిమాలు కొన్నుంటే, ప్రత్యేక గీతాల్లో నర్తిస్తున్న సినిమాలు కొన్నున్నాయి. 'పురుషన్' అనే ఓ తమిళ సినిమాలో కూడా ఈ అందాలభామ నటిస్తున్నది. తెలుగులో నటించిన 'దటీజ్ మహాలక్ష్మి' సినిమా విడుదల కావాల్సివుంది. ఇదిలావుంటే.. తాజాగా టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ఓ ప్రస్టేజియస్ సినిమాలో కీ రోల్ పోషించేందుకు తమన్నా ఇటీవలే సైన్ చేసిందట. ఆ సినిమా మరేదోకాదు, రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇరుముడి'. ఇప్పటివరకూ వచ్చిన రవితేజ సినిమాలకు భిన్నంగా, భావోద్వేగాలతో కూడిన ఓ వినూత్న కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, కథలోని కీలకమైన ఓ పాత్రకు తమన్నాను దర్శకుడు శివ నిర్వాణ ఎంపిక చేశారట. త్వరలోనే తమన్నా ఈ సినిమా సెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం విదితమే.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**